మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి..

నేటి
# ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

Published from Jagitial
www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

ఆదివారం
SUNDAY
25-1-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 || సంచిక: 206 Issue: 206

25 జనవరి 2026 - ఆదివారంశ్రీ విశ్వావసు నామ సంవత్సరంఉత్తరాయణం - శిశిర ఋతువుమాఘ మాసం - శుక్లపక్షంసూర్యోదయం - ఉ. 6:53సూర్యాస్తమయం - సా. 6:03తిథిసప్తమి రా. 11:07 వరకుతరువాత అష్టమిసంస్కృత వారంభాను వాసరఃనక్షత్రంరేవతి మ. 1:35 వరకుతరువాత అశ్వినియోగంసిద్ధ ఉ. 11:37 వరకుకరణంగరజ ఉ. 11:56 వరకువనిజ రా. 11:07 వరకువర్జ్యంలేదు దుర్ముహూర్తంసా. 4:34 నుండి సా. 5:18 వరకురాహుకాలంసా. 4:40 నుండి సా. 6:03 వరకుయమగండంమ. 12:28 నుండి మ. 1:52 వరకుగుళికాకాలంమ. 3:16 నుండి సా. 4:40 వరకు బ్రహ్మముహూర్తంతె. 5:17 నుండి ఉ. 6:05 వరకుఅమృత ఘడియలుఉ. 11:13 నుండి మ. 12:47 వరకుఅభిజిత్ ముహూర్తంమ. 12:06 నుండి మ. 12:50 వరకుగమనిక: "o" అనగా మరుసటి రోజున



కరెన్సీ నోటు కావాలి.. కష్టపడొద్దు!
చెవిలో పువ్వు పెట్టాలి.. చెమట రాలొద్దు!
బెట్టింగులు వేయాలి.. లాటరీలు గెలవాలి!
పుణ్యానికి పైసలు రావాలి.. ఫోజులు కొట్టాలి!
జల్సాలు చేయాలి.. జమీందారిలా బతకాలి!
ఇదే నేటి యువత నైజం.. కఠోరమైన నిజం!!

# పుక్కట్ల పైసలే!

## కష్టపడొద్దు.. కూర్చున్నచోటే డబ్బు రావాలె

### ఈజీ మనీకి అలవాటుపడ్డ నేటి యువత
### సోషల్ మీడియా చూసి ఆబంబరాల వైపు
### విలాసవంత వస్తువులు కొంటూ అప్పుల పాలు
### దాంతో మోసాలు, దొంగతనాలవైపు చూపు



సండే స్పెషల్ స్టోరీ
Sunday Special Story

కష్టపడకుండా త్వరగా డబ్బు సంపాదించాలనే ఆలోచన నేటి యువతలో పెరుగుతోంది. ఈ ధోరణి వారిని తప్పుడు మార్గాల వైపు నడిపిస్తోంది, ఇది వ్యక్తిగతంగా, సామాజికంగా అనేక సమస్యలకు దారితీస్తుంది. సోషల్ మీడియా ప్రభావం, వేగవంతమైన జీవనశైలి, ఆర్థిక ఒత్తిళ్లు యువతను ఈజీ మనీ కోసం ఆశపడేలా చేస్తున్నాయి.

(ఈవార్తలు - సండే స్టోరీ)

సోషల్ మీడియాలో కనిపించే ఆడంబరమైన జీవితాలు, విలాసవంతమైన వస్తువులు యువతను ఆకర్షిస్తున్నాయి. వాటిని త్వరగా పొందాలనే కోరిక ఈజీ మనీ కోసం ప్రయత్నించేలా ప్రేరేపిస్తోంది. నిరుద్యోగం, పెరుగుతున్న ఖర్చులు, భవిష్యత్తుపై అభద్రతా భావం కొంతమంది యువతను అడ్డదారులు తొక్కేలా చేస్తున్నాయి. శ్రమ విలువను గుర్తించకపోవడం, ఓపిక లేకపోవడం, తక్షణ సంతృప్తిని కోరుకోవడం వంటివి ఈజీ మనీ ధోరణికి కారణమవుతున్నాయి. ఈజీ మనీ కోసం ప్రయత్నించే యువత మోసాలు, దొంగతనాలు, ఇతర అసాంఘిక తరువాయి 2 వ పేజీలో...



తెలంగాణ జాగృతి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 'ఈవార్తలు' దినపత్రిక 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత. చిత్రంలో ఈవార్తలు దినపత్రిక ఎడిటర్ బొమ్మకంటి శ్రావణ్ కుమార్, దినపత్రిక సిబ్బంది తదితరులు.

# ప్రధాన పత్రికలకు దీటుగా 'ఈవార్తలు'

### అనతి కాలంలోనే ప్రజల మన్ననలు
### ప్రజావాణి వినిపించడంలో ముందంజ
### జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

బంజారాహిల్స్/హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): తెలుగు దినపత్రికల్లో 'ఈవార్తలు' దినపత్రిక సరికొత్త ఒరవడిని సృష్టిస్తూ దూసుకెళ్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొనియాడారు. ప్రధాన పత్రికలకు దీటుగా అద్భుతమైన కథనాలను ప్రచురిస్తోందన్నారు. ప్రజా సమస్యలను లేవనెత్తడంలో, ప్రజల వాణిని వినిపించడంలో తనదైన శైలిని ప్రదర్శిస్తోందని ప్రశంసించారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో 'ఈవార్తలు' 2026 క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనతి కాలంలోనే ప్రజల మన్ననలు పొందిన పత్రిక యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత ప్రభావవంతంగా వార్తలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా కవితకు ఎడిటర్ బొమ్మకంటి శ్రావణ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దినపత్రిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బండి, అర్వింద్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

### క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరిక

తనపై, తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినందుకుగానూ బీజేపీ ఎంపీలు బండి సంజయ్ కుమార్, ధర్మపురి అర్వింద్‌కు కేటీఆర్ విడివిడిగా లీగల్ నోటీసులు జారీ చేశారు.



హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా వీరు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అడ్డగోలుగా మాట్లాడిన వీరు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ది కోసం బీజేపీ ఎంపీలు బండి సంజయ్, అర్వింద్ తన పరువుకు నష్టం కలిగించేలా మాట్లాడడాన్ని -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.16,026 |
| వెండి (గ్రాము): | రూ.365 |
| ప్లాటినం (గ్రాము): | రూ.8,182 |

# 'బొగ్గు'పై గద్దలు

## సింగరేణి ఆస్తుల కాజేసే ప్లాన్

### అది తెలంగాణ ప్రజల ఆస్తి.. ఎవరికోసమో విషపు రాతలు
### అవన్నీ ప్రజలకు తెలియాలి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సింగరేణి ఆస్తులను కొంతమందికి కట్టబెట్టే ప్లాన్‌తో, కార్మికుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా విషపు రాతలు రాస్తున్నారంటూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషపు రాతల వల్ల రాష్ట్రానికి, సింగరేణికి నష్టం వాటిల్లుతోందని అన్నారు. ఈ మేరకు శనివారం ఉదయం ప్రజాభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు.

హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): సింగరేణిపై అసత్య ప్రచారాల వెనక కుట్ర దాగి ఉందని, సింగరేణి ఆస్తులు కాజేసే ప్లాన్ ఉందని ఆరోపించారు. టెండర్లపై అపోహలు సృష్టించేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎవరి ప్రయోజనాల కోసం తప్పుడు రాతలు రాస్తున్నారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ రాయడాన్ని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణ జరిపిస్తానని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిలో పనిచేస్తున్న దాదాపు 42 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, 30 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా వస్తున్న కథనాలు తనను ఆవేదనకు గురిచేశాయని భట్టి అన్నారు. సింగరేణిలో టెండర్లు, వాటికి సంబంధించిన టెండర్లు కానీ వాటికి సంబంధించిన ఫైళ్లు గానీ తన వద్దకు గానీ రాష్ట్ర ప్రభుత్వం వద్దకు రావని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పారదర్శకంగా -2 వ పేజీలో...



# రేవంత్ బామ్మర్ది రింగ్ మ్యాన్

### బొగ్గు కుంభకోణం నిజం
### లేకపోతే నైనీ టెండర్ల రద్దెందుకు?
### మాజీ మంత్రి హరీశ్ సూటి ప్రశ్న

బొగ్గు కుంభకోణం విషయంలో అవినీతి ఆరోపణలు రావడంతో నైనీ టెండర్ రద్దు చేశారంటే, స్కాం జరిగినట్లేనని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. శనివారం హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. నైనీ వ్యవహారంలో మంత్రి భట్టి మసిబూసి మారేడు కాయ చేస్తున్నారని ఆరోపించారు.

హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): సింగరేణిలో సోలార్ స్కాం చేసిన ఆరోపణలపై మౌనం ఎందుకు వహిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి బావమరిది కోసమే ఈ తతంగమంతానని విమర్శించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక, విషయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నైనీ టెండర్ రద్దు చేయడమే అవినీతికి నిదర్శనమని, అదే తరహాలో పిలిచిన మిగిలిన టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా బీటింగ్ అరౌండ్ ద బుశ్ లా ఏదో చెప్పి, మసిబూసి మారేడు కాయ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ప్రపంచంలోనే అత్యంత వృద్ధ పిల్లి ఈ మధ్యే 30 ఏళ్లు పూర్తి చేసుకుంది. అంటే.. 135 ఏళ్ల మనిషి జీవితంతో సమానం. పిల్లికి 20 ఏళ్లు వస్తే మనిషికి 96 ఏళ్లు వచ్చినట్లు సమానం.

# నాంపల్లిలో అగ్నిప్రమాదం

### ఫర్నిచర్ షాపులో భారీ ఫైర్ యాక్సిడెంట్
### అర్ధరాత్రి వరకు తీవ్రంగా శ్రమించిన ఫైర్ సిబ్బంది
### సెల్లార్‌లో ఐదుగురు చిక్కుకున్నట్లు అనుమానం!



హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని నాంపల్లిలో శనివారం పెద్ద అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఒక ఫర్నిచర్ షోరూమ్‌లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు నిమిషాల వ్యవధిలోనే భవనం మొత్తానికి వ్యాపించాయి. స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నాంపల్లి ప్రధాన రహదారిపై తరువాయి 2 వ పేజీలో...

# కేసీఆర్‌తో కేటీఆర్-హరీశ్ భేటీ

### రాజకీయ పరిస్థితులపై చర్చలు!..
### మున్సిపల్ ఎన్నికలపై వ్యూహాలు?

గజ్వేల్, జనవరి 24 (ఈవార్తలు: సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో శనివారం కేటీఆర్, హరీశ్ భేటీ అయినట్లు తెలిసింది. శుక్రవారం సిట్ ముందు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణకు హాజరైన అనంతరం, రాజకీయ పరిస్థితులపై కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ అయినట్లు పార్టీ వర్గాల సమాచారం. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ కేసు రాజకీయంగా ప్రభావం చూపకుండా వ్యూహాత్మకంగా తరువాయి 2 వ పేజీలో...



# ఆఫ్ఘనిస్తాన్‌లో 61 మంది మృతి

### మంచు తుఫాన్, భారీ వర్షాలతో అస్తవ్యస్తం

ఆఫ్ఘనిస్తాన్‌ను ప్రకృతి వణికిస్తోంది. ఒక పక్క మంచు తుఫాన్, మరో పక్క భారీ వర్షాలు ఆ దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వీటి కారణంగా మూడు రోజుల వ్యవధిలోనే 61 మందికిపైగా మరణించారు. ఈ విషయాన్ని ఆఫ్ఘనిస్తాన్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ (ఏఎన్డీఎమ్ఏ) శనివారం వెల్లడించింది.

## రాశి ఫలాలు
26.1.2026

మేషం: ఇంట బయట శుభ ఫలితాలను పొందుతారు. సమాజంలో కీర్తిప్రతిష్టలు ఇనుమడిస్తాయి. దైవానుగ్రహం తో ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలలో భవిష్యత్తు ప్రణాళికను చేస్తారు. దైవ సేవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగాలలో ఉత్తమ ప్రయోజనాలు పొందుతారు. నిరుద్యోగులకు అనుకూలంగా ఉంటుంది.

వృషభం: శారీరక మానసిక అనారోగ్యాలు ఉంటాయి. ఇతరుల మీద మీ అభిప్రాయం మార్చుకోవడం మంచిది. అనుకొన్న సమయానికి అనుకున్న రీతిలో పనులు పూర్తికాక ఇబ్బందికి గురవుతారు. వృత్తి ఉద్యోగాలలో అధికారులు కోపానికి గురి కావల్సి వస్తుంది. వాహన ప్రయాణ విషయంలో జాగ్రత్త వహించాలి.

మిధునం: నూతన వస్తు, వాహన సౌకర్యం పొందుతారు. సమాజంలో కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. కుటుంబ సభ్యులతో సఖ్యత కలుగుతుంది. ఉద్యోగులకు అనుకూలత పెరుగుతుంది. వ్యాపారాలు వృద్ధి చెందుతాయి.

కర్కాటకం: ఆకస్మిక ధన లాభం కలుగుతుంది. సంఘంలో విశేషమైన గౌరవమర్యాదలు పొందుతారు. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపార ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు అందుతాయి. బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి.

సింహం: ఇతరులతో ఊహించని వివాదాలు కలుగుతాయి వ్యాపారమున ఆలోచన లో స్థిరత్వం లోపిస్తుంది. శరీర ఆరోగ్య సమస్యలు కొంత కలవర పెడతాయి. వృధా ఖర్చులు చేస్తారు. విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్త వహించాలి. సంతాన ఉద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

కన్య: ఆదాయం కంటే ఖర్చులు పెరుగుతాయి. చేపట్టిన పనుల్లో తొందరపాటు నిర్ణయాలు చేస్తారు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. పాత మిత్రులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.ఉద్యోగాలలో అంచనాలు అందుకుంటారు.

తుల: నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. అన్ని వైపుల మంచి జరుగుతుంది. కొన్ని వ్యవహారాలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుతారు. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తవుతాయి. వృత్తిఉద్యోగాలలో ఆర్థిక అనుకూలత కలుగుతుంది. వ్యాపారాలు లాభిస్తాయి.

వృశ్చికం: ఆర్థిక ఇబ్బందులు కలుగుతాయి. సౌకర్యాల కొరత లేకున్నా ఇతరుల వలన ఇబ్బందులు ఉంటాయి. కారణం లేకుండానే కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు విషయంలో జాగ్రత్త వహించాలి. వృత్తి ఉద్యోగాలలో సమస్యలు మానసిక చింతను కలిగిస్తాయి.

ధనస్సు: దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఇంట బయట అనుకూల వాతావరణం ఉంటుంది. విలువైన వస్తువులను సేకరించి వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగ విషయంలో మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. నిరుద్యోగులకు అనుకూల సమయం.

మకరం: చేపట్టిన పనులలో వ్యయ ప్రయాసలు అధికం అవుతాయి. బంధువుల నుండి ఋణ వత్తిడి పెరుగుతుంది. ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది. వ్యాపార వ్యవహారాలలో ఒడిదుడుకులు ఉంటాయి. ఉద్యోగ విషయమై చెయ్యను పనికి నిందలు పడతారు. నిరుద్యోగ ప్రయత్నాలకు నిరాశ తప్పదు.

కుంభం: బంధువుల నుండి విలువైన సమాచారం అందుతుంది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులలో అవాంతరాలు అధిగమించి ముందుకు సాగుతారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో ఉన్నత కలుగుతుంది. విలువైన వస్తువులు బహుమతులుగా లభిస్తాయి.

మీనం: ఇతరులతో వివాదాలు కలిగిన విజయం కలుగుతుంది. వృత్తి, ఉద్యోగాలలో అధికారుల ఆదరాభిమానాలకు పొందుతారు. వ్యాపారపరంగా ఆత్మ విశ్వాసంతో స్థిర నిర్ణయాలు అమలుపరచి మంచి ఫలితాలను సాధిస్తారు. నిరుద్యోగులు లభించిన అవకాశాలను జారవిడువకుండా చూసుకో సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

# ‘బొగ్గు’పై గద్దలు



మొదటి పేజీ తరువాయి

సేవలు అందించేందుకు సింగరేణి కాలరీస్ సంస్థకు ఒక బోర్డు ఉందని...అందులో సీనియర్ అధికారులు ఉంటారని, వారంతా ఒక స్వయంప్రతిపత్తితో నిర్ణయాలు తీసుకుంటారని అని పేర్కొన్నారు. అన్ని నిర్ణయాలు సంస్థలో అమలులో ఉన్న విధివిధానాలు, నిబంధనల ప్రకారమే స్వతంత్రంగా తీసుకుంటారని, రాజకీయ జోక్యానికి ఎక్కడా అవకాశం లేదని స్పష్టం చేశారు.

### 2018 నుంచే సైట్ విజిట్ నిబంధన

సింగరేణి సంస్థ నైనీ బొగ్గు బ్లాకు కాంట్రాక్ట్ విషయంలో కాంట్రాక్టర్లు ముందుగా సైట్ విజిట్ చేయాలని, ఆ మేరకు గని అధికారుల నుంచి సైట్ విజిట్ సర్టిఫికెట్ పొందితేనే కాంట్రాక్టు లో బిడ్డింగ్ చేయడానికి అర్హత కల్పిస్తూ తానేదో కొత్త నిబంధన పెట్టినట్లు ఓ పత్రికలో కథనంలో వచ్చిందని...ఈ నిబంధన దేశంలో మరెక్కడా లేదని కేవలం కొందరు భట్టి విక్రమార్కకు చెందిన వారికి కాంట్రాక్టు అప్పగించడానికే ఇలా చేశారంటూ కట్టు కథనాలను, పిట్ట కథలను అల్లి వార్త ప్రచురించారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన సైట్ విజిట్ చేయటం అనేది కేవలం సింగరేణిలో మాత్రమే ఉన్నది, తమ హయాంలో ప్రవేశ పెట్టింది అంత కన్నా కాదని రుజువులతో వివరించారు. 2018, 2021, 2023 లో కోలిండియా అనుబంధ సంస్థ అయిన సీఎంపీడీఐఎల్ రూపొందించిన సింగరేణి టెండర్ డాక్యుమెంట్ లో, ఇతర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఎన్ఎండీసీ, ఐఐటీ, ఐఐఎం, ఫైనాన్స్ విభాగం, డిఫెన్స్ విభాగం, గుజరాత్ రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర చాలా కంపెనీల్లో చాలా ఏళ్లుగా ఉన్నట్లు, ఆయా కంపెనీలకు సంబంధించిన టెండర్ లేఖలను విలేకరులకు చూపించారు. కోలిండియా కు అనుబంధ సంస్థ అయిన సీఎంపీడీఐఎల్ వారు సింగరేణి సంస్థకు సూచించిన టెండర్ నిబంధనలలో సైట్ విజిట్ జరపడం తప్పనిసరి అని పేర్కొన్నదని సీఎంపీడీఐఎల్ నిబంధన మేరకే సింగరేణి సంస్థ 2018 నుంచి ఈ నిబంధనను పాటిస్తూ వస్తుందన్నారు. ఈ నిబంధన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా పొందుపరిచారు అన్నది పూర్తి అవాస్తవమని పేర్కొన్నారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న నిబంధన అని, తాము కొత్తగా రూపొందించింది కాదు అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

### హరీశ్ ఆరోపణలు సరికాదు

సింగరేణిలో డీజిల్ సరఫరాను కాంట్రాక్టర్లకే అప్పగించడం ద్వారా మరో కుంభకోణానికి తెరలేపారన్న మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపణలను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఖండించారు. డీజిల్ సరఫరా విధానంలో మార్పులు కూడా తమ హయాంలో జరగలేదని, 2022లోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఈ విధానం అమలులోకి వచ్చిందని తెలిపారు. జీఎస్టీ విధాన మార్పులు, డీజిల్ దొంగతనాలు నివారించడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా కాంట్రాక్టల్లోనూ ఈ పద్ధతే అమలులో ఉందన్న విషయాన్ని గుర్తుచేశారు. సింగరేణి సంస్థ టెండర్లను రాష్ట్ర ముఖ్యమంత్రి బావ మరిదికి కట్టబెడుతున్నట్లు ఒక కట్టు కథను ప్రచారం చేస్తున్నారని...వారు పేర్కొన్నట్లుగా సుజన్ రెడ్డి కంపెనీ శోధా కనస్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్. కంపెనీ ఎండి దీప్తి రెడ్డి.ఆమె మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి కుమార్తె. ఆమె భర్త, ఆయన అల్లుడే సుజన్ రెడ్డి అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వివరించారు.

### ప్రజల ఆస్తులను కాపాడుతా

సింగరేణి వ్యాప్తంగా పలు కాంట్రాక్టు పనులు నిర్వహిస్తున్న ఐదు ప్రముఖ కాంట్రాక్టర్లు కూడా టీఆర్ఎస్ నేతలకు బంధువులు లేదా సన్నిహితులు అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వివరించారు. హరీశ్ రావుకు కానీ ఇంకా ఎవరికైనా కానీ అనుమానాలు ఉన్నట్లయితే తనను కోరినట్లయితే వివరించేవాడిని అని పేర్కొన్నారు. కేవలం నైనీ బ్లాక్ టెండర్ పైనే కాకుండా 2014 నుండి ఇప్పటి వరకు జరిగిన అన్ని రకాల టెండర్లపై కూడా విచారణ చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలో ఉన్నారని ఆయన రాగానే తాను స్వయంగా ఆయనతో మాట్లాడి విచారణకు ఆదేశించేలా చూస్తానని పేర్కొన్నారు. అప్పుడు వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. ‘సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి. దీనిపై వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం బురదజల్లడం రాష్ట్రానికి నష్టం చేస్తుంది’ అని హెచ్చరించారు. ‘నేను రాజకీయాల్లోకి వచ్చినది ఆస్తులు దోచుకోవడానికి కాదు. ప్రజల ఆస్తులను కాపాడటానికే వచ్చాను. సింగరేణి కార్మికుల చెమటతో ఏర్పడిన ఈ ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లో రాబందులకు అప్పగించను’ అని భట్టి స్పష్టం చేశారు.

### సింగరేణిపై గద్దలు వాలనీయను

‘నేను మండుటెండలో పీపుల్స్ మార్చ్ పేరిట పాదయాత్ర నిర్వహించి సింగరేణి గనులను సందర్శించానని, సింగరేణి కార్మికుల రక్తం, స్వేదముతో బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని, ఇటువంటి బొగ్గు సంపద పైన ఎటువంటి రాబందులు, గద్దలు, పెద్దలను వాలకుండా చూడడమే తన కర్తవ్యం’అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచుకోవాల్సిన అవసరం అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. గత పదేళ్లలో కొత్త బొగ్గు గనుల అభివృద్ధిలో తగిన ప్రయత్నాలు జరగకపోవడం వల్ల భవిష్యత్తులో ఉత్పత్తి, ఆదాయం తగ్గి వేలాది కుటుంబాల ఉపాధి ప్రమాదంలో పడే పరిస్థితి ఉందని హెచ్చరించారు.ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ రంగంలో మార్పులు, గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు పెరుగుతున్న నేపథ్యంలో, నాణ్యమైన బొగ్గు గనులను త్వరగా సొంతం చేసుకుని ఆపరేషన్‌లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే సింగరేణిని కేవలం బొగ్గుకే పరిమితం చేయకుండా క్రిటికల్ మినరల్స్ రంగంలోనూ విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు.

### వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలను చూస్తే ఊరుకోను

వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం సింగరేణిపై తప్పుడు ప్రచారాలు చేయవద్దని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, సింగరేణి మేనేజ్మెంట్, కార్మికులు పూర్తి కమిట్మెంట్‌తో సంస్థ భవిష్యత్తును కాపాడుతారని స్పష్టం చేశారు. 40 సంవత్సరాలుగా ఉన్నత విలువలతో తాను పనిచేస్తున్నాననీ, తన వ్యక్తిత్వ హననానికి పూనుకున్నారని, అందుకే వాస్తవాలు వివరించానన్నారు. కాబట్టి తనపై రాసిన రాతలు అవాస్తవమని, తిరిగి ప్రజలకు వివరించాలని, లేనట్లయితే తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాను 40 సంవత్సరాలుగా కొన్ని ఉన్నత విలువలతో పనిచేస్తున్నానని, తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలనుకుంటే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు.

## రేవంత్ బామ్మర్ది రింగ్ మ్యాన్

మొదటి పేజీ తరువాయి

చేసారు. మీరెన్ని సాకులు చెప్పినా మీ కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది నిజం. అందులో రేవంత్ రెడ్డి బామ్మర్ది రింగ్‌మ్యాన్‌గా పాత్ర పోషించింది నిజం. నేను సూటిగా అడుగుతున్నా. ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎందుకు ప్రకటించారు నిన్న బయటపెట్టిన మరో కుంభకోణం.. సోలార్ పవర్ స్కాం గురించి ఎందుకు ఒక్క మాట కూడా ప్రెస్ మీట్ లో మాట్లాడలేదని నిలదీశారు. నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదు సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనను బీఆర్ఎస్ మీద నెట్టే ప్రయత్నం చేయడం వల్ల నిజాలు అబద్దాలు అయిపోవు. జరిగిన స్కాంలు, స్కీంలుగా మారిపోవని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి, బావమరిది కుంభకోణంపై విచారణకు హామీ ఇస్తే లేఖ రాస్తా. సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని చెప్పి, దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారు అది తప్పు కాకుంటే నైనీ ఎందుకు రద్దు చేసినట్లు ఇదే సైట్ విజిట్ విధానం సింగరేణిలో కూడా అమలు చేసామని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు ధన్యవాదాలని అన్నారు. భట్టి గారూ. మీరంటే నాకు చాలా గౌరవం. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ మాత్రమే చేయగలవు అన్న ఉద్దేశ్యంతోనే లేఖ రాసాను. మీరు నిజంగా రేవంత్ రెడ్డి, అతని బావమరిది కుంభకోణం మీద నిశ్పక్షపాతంగా విచారణ జరిపిస్తాను అని హామీ ఇస్తే మీకూ లేఖ రాయడానికి సిద్ధం’ అని స్పష్టం చేశారు.

## కేసీఆర్‌తో కేటీఆర్-హరీశ్ భేటీ

మొదటి పేజీ తరువాయి

వ్యవహరించాల్సిన అంశాలపై వీరు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ వివాదాన్ని ఆసరాగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధిపొందే ప్రయత్నం చేస్తోందని, దానికి తగిన ప్రతిస్పందన ఎలా ఇవ్వాలన్న దానిపై లోతైన సమీక్ష జరిగినట్లు సమాచారం. పార్టీ శ్రేణుల్లో అయోమయం లేకుండా స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వాల్సిన అవసరంపైనా చర్చించినట్లు తెలిసింది. ఈ భేటీ బీఆర్ఎస్ రాజకీయ వ్యూహాలకు కీలకంగా మారినట్లు సమాచారం.

## నాంపల్లిలో అగ్నిప్రమాదం

మొదటి పేజీ తరువాయి

ఉన్న నాలుగు అంతస్తుల కమర్షియల్ భవనంలో ఈ ప్రమాదం సంభవించింది. భవనం కింద ఉన్న సెల్లర్‌లోని హోల్‌సేల్ ఫర్నిచర్ షాపులో మొదట మంటలు చెలరేగాయి. షాపులో అధికంగా ఫర్నిచర్ ఉండటంతో మంటలు వేగంగా పై అంతస్తుల వరకు వ్యాపించాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్మేయడంతో ప్రజలు పరుగులు తీశారు.ప్రారంభంలో భవనంలో ఇద్దరు నుండి నలుగురు పిల్లలు చిక్కుకున్నట్లు సమాచారం రావడంతో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. అయితే, అగ్నిమాపక సిబ్బంది చేరుకోకముందే స్థానిక యువకులు సాహసించి పిల్లలను భద్రంగా బయటకు తీసుకువచ్చారు. అయితే, భవనంలో చిక్కుకుపోయిన ఐదుగురిని రక్షించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. లోపల చిక్కుకున్న వారిలో ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంటలను అదుపు చేసేందుకు నాలుగు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరాయి. భవనం ఇరుకైన చోట ఉండటం, చుట్టూ సెట్‌బ్యాక్స్ లేకపోవడం కారణంగా అగ్నిమాపక యంత్రాలు లోపలికి వెళ్లలేకపోయాయి. దీనివల్ల సిబ్బంది పక్కభవనాల గోడలపై ఎక్కి, ప్రాణాలకు తెగించి మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. ప్రధాన రహదారిపై జరిగిన ప్రమాదం కారణంగా నాంపల్లి నుంచి అబిడ్స్ వెళ్ళే మార్గంలో భారీ ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ పోలీసులు వెంటనే వాహనాలను ఇతర మార్గాల్లోకి మళ్లించారు. గంటల తరబడి శ్రమించిన అనంతరం అగ్నిమాపక సిబ్బంది మంటలను ప్రాథమికంగా అదుపులోకి తీసుకువచ్చారు. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, మంటలకు కారణం, పరిష్కార మార్గాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంటలు వ్యాప్తి చెందకుండా పక్క భవనాల ప్రజలను ఖాళీ చేయాలని ఆదేశించారు.

## బండి, అర్వింద్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి

కేటీఆర్ ఖండించారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా దురుద్దేశపూర్వకంగా, రాజకీయాల కోసం వీరిరువు దిగజారి మాట్లాడుతున్నారని తెలిపారు. ఇప్పటికే కేంద్రమంత్రి బండి గతంలో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసు న్యాయస్థానంలో ఉన్నప్పటికీ, చట్ట వ్యతిరేకంగా ఆయన మరోసారి తనపై నోరు పారేసుకున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ మేరకు బండి సంజయ్, అర్వింద్‌లకు కేటీఆర్ తన న్యాయవాదులతో నోటీసులు పంపించారు. బండి సంజయ్‌కు పంపిన నోటీసులో, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఆయన చేసిన ఆరోపణలను కేటీఆర్ న్యాయవాదులు ప్రస్తావించారు. కేటీఆర్ కుటుంబం ఫోన్ ట్యాపింగ్ ద్వారా వేల కోట్ల రూపాయలు సంపాదించిందని, సెలబ్రిటీల ఫోన్లు ట్యాప్ చేశారంటూ జనవరి 23న ప్రెస్ మీట్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఇప్పటికే బండి సంజయ్‌పై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా నడుస్తున్నప్పటికీ, మళ్ళీ అదే తరహాలో తప్పుడు ఆరోపణలు చేయడం దురుద్దేశపూర్వకమని కేటీఆర్ మండిపడ్డారు. మరోవైపు ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు పంపిన నోటీసులో ఆయన చేసిన వ్యక్తిగత దూషణలను కేటీఆర్ తప్పుబట్టారు. డ్రగ్స్ సేవించడం, మత్తుపదార్థాలు సరఫరా చేస్తున్నారంటూ అర్వింద్ చేసిన వ్యాఖ్యలు అక్షేపణీయమని కేటీఆర్ పేర్కొన్నారు. కేటీఆర్ రాష్ట్ర అభివృద్ధికి, ఐటీ రంగ విస్తరణకు కృషి చేసిన మాజీ మంత్రి అని, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అని, అటువంటి వ్యక్తిపై ఎటువంటి సాక్ష్యాలు లేకుండా అడ్డగోలుగా మాట్లాడడం రాజకీయ కక్ష సాధింపేనని న్యాయవాదులు లీగల్ నోటీసులో వివరించారు. ఈ ఇద్దరు ఎంపీలు తమ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, కేటీఆర్‌కు బహిరంగంగా నిబంధనలు లేని క్షమాపణలు చెప్పాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. నోటీసు అందిన ఐదు రోజుల్లోగా స్పందించని పక్షంలో సివిల్, క్రిమినల్ చట్టాల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిత్వ హననానికి పాల్పడితే న్యాయపరంగా మూల్యం చెల్లించుకోక తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.



## ఆఫ్ఘనిస్తాన్‌లో 61 మంది మృతి

### మంచు తుఫాన్, భారీ వర్షాలతో అస్తవ్యస్తం

కాబూల్: ఆఫ్ఘనిస్తాన్‌ను ప్రకృతి వణికిస్తోంది. ఒక పక్క మంచు తుఫాన్, మరో పక్క భారీ వర్షాలు ఆ దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వీటి కారణంగా మూడు రోజుల వ్యవధిలోనే 61 మందికిపైగా మరణించారు. ఈ విషయాన్ని ఆఫ్ఘనిస్తాన్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ (ఏఎన్డీఎంఏ) శనివారం వెల్లడించింది. గత మూడు రోజులలో సెంట్రల్, ఉత్తర ఆఫ్ఘనిస్తాన్ లో మంచు తుఫాన్, భారీ వర్షాలు విలయం సృష్టించాయి. వరదలు, మంచు చరియలు విరిగిపడటం, ఇండ్లు కూలిపోవడం వంటి ఘటనల వల్ల దాదాపు 61 మంది మరణించారు. మృతుల్లో ఆరుగురు పిల్లలు కూడా ఉన్నారు. 110 మందికిపైగా గాయపడ్డారు. 458 వరకు ఇండ్లు ధ్వంసమయ్యాయి. 360కిపైగా కుటుంబాలు తీవ్ర ప్రభావానికి గురయ్యాయి. అలాగే అనేక చోట్ల రోడ్లు పాడైపోయాయి. మరోవైపు చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. ఉష్ణోగ్రతలు 0 డిగ్రీలకు పడిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరణాల సంఖ్య కూడా పెరుగుతోంది. మంచు కురిసే ప్రాంతాల్లో ప్రజలు ఇండ్లనుంచి బయటకు రాకూడదని అధికారులు సూచించారు. రోడ్లు కొట్టుకుపోవడం వల్ల చాలా ప్రాంతాలకు రవాణా నిలిచిపోయింది. అనేక ప్రాంతాలు ఇంకా చీకట్లోనే మగ్గుతున్నాయి. ఈ దేశానికి విద్యుత్ అందించే ఉజ్బెకిస్తాన్ పవర్ లైన్స్ కూడా కొట్టుకుపోయాయి. ప్రస్తుతం తమకు మానవతా సాయం అవసరమని అక్కడి అధికారులు అంటున్నారు. ఐక్యరాజ్యసమితి సహా ప్రపంచ దేశాలు స్పందించాలని కోరుతున్నారు.

# పుక్కట్ల పైసల్!

మొదటి పేజీ తరువాయి

కార్యకలాపాలలో చిక్కుకుంటున్నారు. నేరారోపణలు, జైలు శిక్షలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. మంచి ఉద్యోగాలు, ఉన్నత స్థానం లభించే అవకాశాలు తగ్గిపోతున్నాయి. యువత తీసుకునే తప్పుడు నిర్ణయాలు వారి కుటుంబాలకు తీరని బాధను కలిగిస్తాయి. ఆర్థికంగా, మానసికంగా కుటుంబాలు చితికిపోతున్నాయి.

### బెట్టింగ్‌తో జీవితాలు ఛిన్నాభిన్నం

ప్రస్తుతం బెట్టింగ్ మహమ్మారి ఒక నిశ్శబ్ద విపత్తులా మారుతోంది. గతంలో కేవలం పండుగలు, ప్రత్యేక సందర్భాలకే పరిమితమైన జూదం, నేడు స్మార్ట్‌ఫోన్ల పుణ్యమా అని ప్రతి ఒక్కరి జేబులోకి చేరిపోయింది. ఈ ఈజీ మనీ (సులభంగా డబ్బు సంపాదించడం) వ్యామోహం యువతను పెడతోవ పట్టిస్తోంది. ఫలితంగా లక్షల రూపాయల అప్పుల ఊబిలో కూరుకుపోయి, చివరకు నేరాల బాట పడుతుండటం సామాజిక ఆందోళనకు దారితీస్తోంది. క్రికెట్ బెట్టింగ్ మొదలుకొని ఆన్‌లైన్ రమ్మీ, పేకాట, ఇతర గేమింగ్ యాప్‌ల వరకు అన్నీ నేడు వేల సంఖ్యలో అందుబాటులో ఉన్నాయి. ఆకర్షణీయమైన ప్రకటనలు, మొదట్లో వచ్చే చిన్నపాటి లాభాలు యువతను బానిసలుగా మార్చుతున్నాయి. ఒక్కసారి డబ్బులు పోవడం మొదలైన తర్వాత, పోగొట్టుకున్న సొమ్మును తిరిగి సంపాదించాలనే తాపత్రయంతో మరిన్ని బెట్టింగ్‌లు కడుతూ లక్షల్లో నష్టపోతున్నారు. బెట్టింగ్‌ల వల్ల కలిగే ఆర్థిక నష్టం కేవలం ఆ వ్యక్తికే పరిమితం కావడం లేదు. కుటుంబాలు వీధిన పడుతున్నాయి. చేతిలో చిల్లిగవ్వ లేక, అప్పులు తీర్చే మార్గం కనిపించక యువత దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, డ్రగ్స్ సరఫరా వంటి ఘోరమైన నేరాలకు పాల్పడుతున్నారు. మరికొందరు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత విషాదకరం. ప్రభుత్వాలు ఆన్‌లైన్ జూదంపై కఠిన చట్టాలను అమలు చేస్తున్నప్పటికీ, అక్రమ యాప్‌లు విదేశీ సర్వర్ల ద్వారా కార్యకలాపాలు సాగిస్తూనే ఉన్నాయి. కేవలం పోలీసుల నిఘా మాత్రమే దీనిని అరికట్టలేదు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై, వారి ఆర్థిక లావాదేవీలపై కన్నేసి ఉంచాలి. స్మార్ట్‌ఫోన్‌ల అతి వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలి.

### తెలంగాణ పరిస్థితి ఇదీ..

తెలంగాణలో 2025లో ఆన్‌లైన్ బెట్టింగ్ మరియు జూదం కేసులు ఆందోళనకరంగా పెరిగాయి. తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రికార్డుల ప్రకారం 678 మంది బాధితులు నేరుగా పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఇది 2024లో నమోదైన 383 ఫిర్యాదులతో పోలిస్తే దాదాపు 100% పెరుగుదల నమోదైంది. బెట్టింగ్ మాయలో పడి బాధితులు 2025లో దాదాపు రూ. 9.57 కోట్లు నష్టపోయారు. ఇది అంతకుముందు ఏడాది (రూ. 3.45 కోట్లు) కంటే 177% ఎక్కువ. రాష్ట్రవ్యాప్తంగా బెట్టింగ్‌కు సంబంధించి 3,900 కి పైగా నిబంధనల ఉల్లంఘనలు నమోదయ్యాయి. నిషేధిత బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు గానూ 25 మంది సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై హైదరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు.



# ఫోన్ ట్యాపింగ్ దోషులను వదలం

**చట్టబద్ధంగానే విచారణ జరుగుతోంది**

**మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టీకరణ**



హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ కేసులో దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని రాజకీయ కక్షగా చిత్రీకరించడం పూర్తిగా తప్పని, ఫోన్ ట్యాపింగ్ అనేది అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి జూపల్లి... ఈ కేసులో ప్రజాస్వామ్య పద్ధతిలో, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌లో పాత్రధారులు ఎవరు దీని వెనుక సూత్రధారులు ఎవరు అన్నది ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల పన్నుల డబ్బుతో నడిచే విజిలెన్స్, భద్రతా వ్యవస్థలను దుర్వినియోగం చేయడం దిగజారుడుతనమేనని వ్యాఖ్యానించారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన చర్యలను చూస్తూ ఊరుకోవాలా దర్యాప్తే చేయకూడదా అని ఆయన ప్రశ్నించారు. ఈ కేసులో ఎవరినీ లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకోవడంలేదని, పూర్తిగా చట్టబద్ధంగానే విచారణ సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని అప్పట్లోనే వి.ప్రకాశ్ అనే వ్యక్తి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా తన ఫోన్ ట్యాప్ అయినట్టు గతంలో వెల్లడించిన విషయాన్ని ప్రస్తావించారు. ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి కూడా ఇదే విషయం చెప్పారని అన్నారు. మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైందన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయని చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్ సహా మరికొందరు కూడా తమ ఫోన్లు ట్యాప్ అయి ఉండొచ్చని అంగీకరించారని జూపల్లి తెలిపారు. కేటీఆర్‌కు కేవలం 160 సీఆర్పీసీ కింద మాత్రమే నోటీసులు ఇచ్చారని, ఆయనను నేరస్తుడిగా పరిగణించలేదని మంత్రి స్పష్టం చేశారు. సాక్షిగా సమాచారం కోసం మాత్రమే విచారణకు పిలిచామని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించిన కోదండరామ్‌ను కూడా గతంలో అక్రమంగా అరెస్ట్ చేసిన ఉదంతాన్ని గుర్తు చేస్తూ... చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి విచారణ చేయడం కొత్త విషయం కాదన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావుపై కూడా మంత్రి ప్రశ్నలు సంధించారు. కీలక సమయంలో ఆయన అమెరికాకు ఎందుకు వెళ్లారని నిలదీశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు తిరిగి భారత్‌కు వచ్చారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో మార్పులకు అనేక కారణాలున్నాయని, వాటిపై కూడా సమగ్రంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు.



## మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ ఇంచార్జీల నియామకం

హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. ఈ మేరకు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా సమన్వయకర్తల జాబితాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్ బాధ్యతలను ఒక సీనియర్ నాయకుడికి అప్పగించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు వీరు నిరంతరం స్థానిక నాయకత్వానికి, కేడర్‌కు అందుబాటులో ఉంటారని కేటీఆర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాలను రూపొందించడం ఇన్‌ఛార్జ్‌ల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఇన్‌ఛార్జ్‌లది కీలక పాత్ర అని ఆయన తెలిపారు. స్థానిక నాయకత్వంతో చర్చించి, అందరినీ సమన్వయపరిచి గెలుపు గుర్రాలకు సంబంధించిన నివేదికను పార్టీ అధిష్ఠానానికి వారు సమర్పిస్తారని అన్నారు. పార్టీ ప్రచార కార్యక్రమాలను ఇన్‌ఛార్జ్‌లు ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకువెళ్లాలని సూచించారు. ఎన్నికల సరళి, క్షేత్రస్థాయి పరిశీలన, కార్పొరేషన్, మున్సిపాలిటీలలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## అచ్చంపేటలో ఇద్దరు మావోలు అరెస్ట్

అచ్చంపేట, జనవరి 24 (ఈవార్తలు): ఇప్పటికే వరుస ఎన్ కౌంటర్లు, లొంగుబాట్లతో భారీగా దెబ్బతిన్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్, మిలిటరీ ఇన్‌స్ట్రక్టర్ మీసాల సాల్మన్ అలియాస్ సంతోశ్ నాగరాజు, డీవీసీఎం అయిన ఆయన భార్యను నాగర్ కర్నూలు పోలీసులు అరెస్ట్ చేశారు. అచ్చంపేటకు వచ్చిన వీరు... మావోయిస్టు ఫ్రంట్ సంస్థల నేతల సాయంతో మావోయిస్టు కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు మహబూబ్ నగర్, నల్లమల ప్రాంతాల్లో మావోయిస్టులకు సహకరిస్తూ, వారికి ఆశ్రయం కల్పిస్తున్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో సివిల్ లిబర్టీస్ కమిటీ జాయింట్ సెక్రటరీ జక్క బాలయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ కో-కన్వీనర్ ఎడ్ల అంబయ్య, మంశెట్టి యాదయ్య ఉన్నారు. ఎర్టిగా కారులో మన్ననూరు నుంచి



# సింగరేణి రికార్డులను సీజ్ చేయాలి

**గతంలో కేసీఆర్ కుటుంబం దోచుకుంది**

**ఇప్పుడు అదే పనిలో కాంగ్రెస్ మంత్రులు**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు**

హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. రెండు పార్టీలూ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు అదే పనిలో ఉన్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే... బీఆర్ఎస్ అవినీతిపై విచారణ జరుపుదామా అని మంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానిస్తున్నారని... ఇదంతా చూస్తే రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని అర్థమవుతోందని బండి సంజయ్ అన్నారు. సింగరేణిలో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన గనుల కేటాయింపులు, దోపిడీపై పూర్తిస్థాయి విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో దోపిడీపై ప్రశ్నిస్తే గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సాధన కోసం సింగరేణి కార్మికులు పోరాటాలు చేస్తే... ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే ఇప్పుడు మరింత ఎక్కువగా గనుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలయాపన చేయకుండా సింగరేణికి సంబంధించిన అన్ని రికార్డులను వెంటనే సీజ్ చేయాలని కోరారు. ఆలస్యం జరిగితే అవి తారుమారు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో సింగరేణిని అప్పులపాలు చేసి, దోచుకున్న డబ్బుతోనే బీఆర్ఎస్ పార్టీని నడిపించారని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తీసుకొస్తామంటూ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఆ నిధులను మళ్లించడం పరిపాటిగా మారిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలేనని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మేయర్, ఛైర్మన్ స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. కేటీఆర్‌ను సాక్షిగా పిలిచామని మంత్రులు చెబుతుంటే, అసలు దోషులను సాక్షులుగా ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. ఇలా చేస్తే ఫోన్ ట్యాపింగ్ చేసిన అసలు నిందితులను కాపాడుతున్నట్టేనని ఆరోపించారు. సిట్‌పై ప్రభుత్వ ఒత్తిడి ఉంటే దాని విశ్వసనీయత కోల్పోతుందని హెచ్చరించారు. కేటీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడుతున్నారని, ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ దేవాలయంలో కుటుంబంతో కలిసి ప్రమాణం చేసే ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు. హీరోయిన్లు, వ్యాపారులు, బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల నంబర్లను కూడా మావోయిస్టుల జాబితాలో పెట్టి ట్యాపింగ్ చేయలేదా అని నిలదీశారు.

## ఐఏఎస్-ఐపీఎస్ రిజిస్టర్ మ్యారేజ్

**ఆడంబరాలకు దూరంగా ఒక్కటైన యువ జంట**

**చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో**

**శేషాద్రిని, శ్రీకాంత్ రెడ్డి మ్యారేజ్**



చౌటుప్పల్, జనవరి 24 (ఈవార్తలు): ఉన్నత ప్రభుత్వ హోదాల్లో ఉన్నప్పటికీ, ఆడంబరాలకు దూరంగా ఉంటూ ఓ ఐపీఎస్ అధికారిణి, శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారి నిరాడంబరంగా వివాహం చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని లింగారెడ్డిగూడెంకు చెందిన ఐపీఎస్ అధికారిణి శేషాద్రిని రెడ్డి, ఏపీలోని కడప జిల్లాకు చెందిన ట్రైనీ ఐఏఎస్ శ్రీకాంత్ రెడ్డి శనివారం చట్టబద్ధంగా ఒక్కటయ్యారు. చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అత్యంత సాదాసీదాగా వీరి వివాహం జరిగింది. కేవలం కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో రిజిస్ట్రార్ ఎదుట సంతకాలు చేసి ఈ జంట ఒక్కటయ్యారు. ప్రస్తుతం కుత్బుల్లాపూర్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న శేషాద్రిని, ఐఏఎస్ శిక్షణార్థి శ్రీకాంత్ రెడ్డి ఎలాంటి ఆర్భాటాలకు పోకుండా వివాహం చేసుకోవడం విశేషం. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి అట్టహాసంగా పెళ్లిళ్లు చేసుకుంటున్న ఈ రోజుల్లో, ఉన్నత స్థాయిలో ఉన్న ఈ జంట తీసుకున్న నిర్ణయంపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. హోదా పెరిగినా ఒదిగి ఉండాలనే వీరి తీరు ఎందరికో స్ఫూర్తినిస్తోందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఈ వేడుకకు హాజరైన పలువురు ఉన్నతాధికారులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## చిల్లర భాషను వాడను

హెచ్చరికలకు భయపడను: ఆరెస్పీ

ఆధారాలతో సమాధానమిస్తానని వెల్లడి



హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో సిట్ దర్యాప్తును విమర్శిస్తూ మీడియా సమావేశం నిర్వహించిన 12 గంటల్లోపే తనకు నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ ముఖ్య నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రతీకార చర్యేనని ఆరోపించారు. ప్రభుత్వ హెచ్చరికలకు, నోటీసులకు భయపడేది లేదని, తన వద్ద ఉన్న ఆధారాలతోనే సిట్‌కు సమాధానం ఇస్తానని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తమ పార్టీ సీనియర్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులకు సంబంధం లేకున్నా సిట్ వేధిస్తోందని శుక్రవారం మీడియా సమావేశంలో విమర్శించినట్లు ఆయన గుర్తుచేశారు. ఆ ప్రెస్ మీట్ ముగిసిన 12 గంటల్లోపే, శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు సిట్ పోలీసులు తన ఇంటికి వచ్చి నోటీసులు ఇచ్చారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. రెండు రోజుల్లో ఆధారాలతో సమాధానం ఇవ్వాలని, లేకపోతే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై గొంతెత్తడం ప్రతిపక్ష నేతగా తన హక్కు అని, ఇలాంటి వార్నింగులకు భయపడనని తేల్చిచెప్పారు. సిట్ చీఫ్ సజ్జనార్‌పై తాను వ్యక్తిగత ఆరోపణలు చేయలేదని, ఆయనపై ఏపీలో నమోదైన కేసులపై సిట్ వేయాలని డిమాండ్ చేసినట్లు నోటీసులో పేర్కొనడం వాస్తవ విరుద్ధమని అన్నారు. "నేను వ్యక్తిగత దూషణలు చేయను... చిల్లర భాషను వాడను. 2015లో ఓటుకు నోటు కేసు సమయంలో నాటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి కెమెరాకు అడ్డంగా దొరికారు. ఆ తర్వాత ఏపీ నేతల ఫోన్లు ట్యాప్ చేశారని తెలంగాణ ఇంటెలిజెన్స్ అధికారులపై కేసులు నమోదయ్యాయి. ఆ సమయంలో సజ్జనార్ కూడా ఇంటెలిజెన్స్ విభాగంలో అధికారిగా పనిచేశారు. అందుకే, ఇప్పుడు ఆయనే ఈ ట్యాపింగ్ కేసు దర్యాప్తుకు నేతృత్వం వహించడం నైతికంగా సరైంది కాదని మాత్రమే నా అభిప్రాయం చెప్పాను. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు" అని తన వ్యాఖ్యలను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమర్థించుకున్నారు. ప్రభుత్వం తమపై కక్ష సాధిస్తోందని, బీఆర్ఎస్ నేతలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న బొగ్గు కుంభకోణం వంటివాటిపై సిట్ ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. కేవలం ప్రభాకర్ రావు, ఆయన కుటుంబ సభ్యులు, కింది స్థాయి సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దర్యాప్తు చేయడం అన్యాయమని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు మాత్రమే ఆగమేఘాల మీద నోటీసులు రావడం, దర్యాప్తు వివరాలు మీడియాకు లీక్ కావడం, కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లో లైవ్ కామెంటరీలు ఇవ్వడం చూస్తుంటే ఇదంతా రాజకీయ కుట్ర అని స్పష్టమవుతోందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా తమ పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు.

## టీజీ మున్సిపల్ ఎన్నికల్లో గెలుస్తాం: జనసేన

హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన పార్టీ నిర్ణయించిన విషయం తెలిసిందే. గత నెలలో తెలంగాణ జనసేన పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు అధికారిక ప్రకటన విడుదల చేసింది. జనసేన పార్టీ పోటీకి సిద్ధం కావడంతో పలు రాజకీయ పార్టీల నాయకులు సైతం స్పందించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పోటీ చేయవచ్చని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పెద్దపల్లి పట్టణంలో హరీశ్ గౌడ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, నటుడు సాగర్ (ఆర్కే నాయుడు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లిలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ జెండా ఎగరడం తథ్యమని అన్నారు. రాబోయే ఎన్నికలలో తెలంగాణలో జనసేన జెండాను ఎగురవేసి ప్రజలకు అందుబాటులో ఉంటామని ఆయన పేర్కొన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి సముచిత గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు.

**కళ్ల ముందే కరెంట్ షాక్‌తో**

## భర్త, కొడుకు మృతి

**మహబూబాబాద్ మండలం బలరాంతండాలో విషాదం**

మహబూబాబాద్, జనవరి 24 (ఈవార్తలు): మహబూబాబాద్ జిల్లాలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. మహబూబాబాద్ మండలం బలరాంతండాలో ఓ మహిళ కళ్ల ముందే ఆమె భర్త, కుమారుడు మృతి చెందారు. కేలోత్ మదన్ తన భార్య అనిత, కుమారుడు లక్షిత్‌తో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్లారు. మదన్ ట్రాక్టర్‌తో భూమిని దున్నిన అనంతరం కుమారుడితో కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత కుమారుడిని పొలంలోని భార్య వద్దకు తీసుకువెళ్లేందుకు భుజాలపై ఎత్తుకుని వెళుతుండగా, బాలుడు వ్యవసాయ మోటార్ విద్యుత్తు తీగను పట్టుకున్నాడు. దీంతో ఇద్దరూ విద్యుదాఘాతానికి గురై పక్కనే ఉన్న బావిలో పడిపోయారు. కళ్ల ముందే భర్త, కుమారుడు విద్యుత్ షాక్‌కు గురై బావిలో పడిపోవడం చూసిన అనిత గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల రైతులు బావి వద్దకు వచ్చేసరికి ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. భర్త, కుమారుడు మృతి చెందడంతో అనిత రోదనలు మిన్నంటాయి. మదన్ మృతదేహాన్ని స్థానికులు వెలికితీశారు. బాలుడి మృతదేహం కోసం గాలిస్తున్నారు.

## కావాలనే ఫోన్ ట్యాపింగ్‌పై జాప్యం

**బీజేపీ రామచందర్ రావు ఆగ్రహం**

హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ అంశంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ రాజ్యాంగ ఉల్లంఘన అని అన్నారు. ఈ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి ఫోన్ ట్యాపింగ్ డ్రామాకు తెరలేపాయని విమర్శించారు. ఈ కేసులో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ కలిసి ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ కుట్రలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌తో నష్టపోయిన వారికి న్యాయం జరగాలంటే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ వేగవంతం కావాలని, బాధ్యులపై త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో భారతరత్న కర్పూరీ ఠాకూర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడారు. కర్పూరీ ఠాకూర్ బీహార్ రాష్ట్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరి అభివృద్ధి కోసం ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. ఉచిత విద్య, రిజర్వేషన్లు, రైతు సంక్షేమం వంటి అనేక సంస్కరణలను దశాబ్దాల క్రితమే అమలు చేసిన గొప్ప నాయకుడు అన్నారు. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న పురస్కారం అందించిందని గుర్తుచేశారు.





# ఘనంగా గీతాంజలి స్కూల్ 32 వ వార్షికోత్సవం

హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): సైదాబాద్ సరస్వతినగర్‌లోని గీతాంజలి స్కూల్ 32వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. శని వారం రవీంద్రభారతి వేదికగా జరిగిన ఈ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా రామకృష్ణమఠ్ అధ్యక్షులు స్వామి బోధమయానందజీ, సైకాలజిస్టు కౌన్సెలింగ్ డా.సి.వీరేందర్ హాజరై, ప్రసంగించారు. విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు, వినయ విధేయతలు కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను గీతాంజలి స్కూల్ యాజమాన్యం వెలికితీసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు వీక్ష కులను ఆకట్టుకొన్నాయి. కార్య క్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ కె.దయాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎన్.శ్రీలక్ష్మి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



# శిల్పారామంలో ఘనంగా వసంత పంచమి

**సులోచన కళాక్షేత్రం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన**

హైటెక్ సిటీ/హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): వసంత పంచమిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని శిల్పారామంలో శనివారం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. సులోచన కళాక్షేత్రం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య నీరాజనం వైభవంగా సాగింది. ప్రముఖ నాట్య గురువు శ్రీమతి రాధిక సతీశ్ వేముల మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన 40 మందికి పైగా విద్యార్థులు ఈ నృత్య సమర్పణలో పాల్గొని ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సంప్రదాయ కూచిపూడి శైలిలో సాగిన ఈ నృత్య ప్రదర్శనలో భక్తి, లయ, అభినయాల సమ్మేళనం కనువిందు చేసింది. కార్తికేయ వేముల, ఆదితి, వర్ణిక, రాధిక, మేఘ, మోక్షిత, సహస్ర రుద్ర, కృతిక, అనైనా, శ్రిద వంటి విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. చిన్న వయస్సులోనే శాస్త్రీయ నృత్యంపై లోతైన అవగాహనను చాటిన ఈ విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడంలో సులోచన కళాక్షేత్రం, నాట్య గురువు శ్రీమతి రాధిక సతీశ్ వేముల నాయకత్వంలో చేస్తున్న కృషి ప్రశంసనీయం అని కళారసికులు అభినందించారు.

# వికసిత్ భారత్ లక్ష్యంగా ఉద్యోగ మేళాలు

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి.. సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో 18వ విడత ఉద్యోగ మేళా

హైదరాబాద్, జనవరి 24 (పీఐబీ): కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే ప్రయత్నాల్లో భాగంగా అన్ని మంత్రిత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి నిర్దిష్ట కాలపరిమితితో నియామక ప్రక్రియలను చేపడుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టలో గల సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన 18వ విడత ఉద్యోగ మేళాలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాల్లో నియామక ప్రక్రియ క్రమబద్ధీకరణ, వేగవంతం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు 2022 నుంచి రోజ్‌గార్ మేళాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఉద్యోగాల్లో నియమితులైన యువత వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తారు అని అన్నారు. ప్రభుత్వ రంగంలో ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా... అంకుర సంస్థలను ప్రోత్సహించడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి కల్పనను పెంచడంపై కేంద్రం దృష్టి సారించిందని తెలిపారు. ప్రస్తుత ప్రపంచ అనిశ్చితుల మధ్య ప్రపంచ దేశాలకు భారత్ నమ్మకమైన గమ్యస్థానంగా ఉంది. ఆయా దేశాల నుంచి వచ్చే కొత్త పెట్టుబడులు మన దేశంలో ఉద్యోగాలను సృష్టించడంలో సహాయపడతాయి అని వెల్లడించరు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 213 మంది అభ్యర్థులకు కేంద్ర మంత్రి నియామక పత్రాలను అందజేశారు. సీఆర్‌పీఎఫ్‌లో 179, ఎస్ఎస్‌బీలో 5, ఐటీబీపీలో 16, బీఎస్ఎఫ్‌లో 5, ఐఎఫ్ఎల్‌యూలో 1, ఐఐటీ–హైదరాబాద్‌లో 3, బ్యాంక్ ఆఫ్ బరోడాలో 1, విద్యా మంత్రిత్వ శాఖలో 3 ప్రొఫెసర్ పోస్టులు వీటిలో భాగంగా ఉన్నాయి. ఉద్యోగం పొందిన వారిలో 15 మంది మహిళలు ఉన్నారు. సౌత్ జోన్ మెడికల్ ఐజీ గణేష్ చంద్ర పాడి, హైదరాబాద్ సెంటర్ డీఐజీ ఉదయ భాస్కర్ బిల్లా,




కమాండెంట్ మోహన్ దాస్ కోబ్రగాడే సహా సీనియర్ సీఆర్‌పీఎఫ్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 18వ రోజ్‌గార్ మేళాను దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో నిర్వహించారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి కొత్తగా నియమితులైన 61,000 మంది అభ్యర్థులు వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆరోగ్యం–కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం, ఉన్నత విద్యా విభాగం సహా భారత ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో చేరనున్నారు.




# న్యాయవాదుల రక్షణ చట్టం అవసరం

**నవీన్ కుమార్ వాసిరెడ్డి**

నాంపల్లి/హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): సిద్దిపేట కోర్ట్ ప్రాంగణంలో న్యాయవాది అశోక్‌పై జరిగిన దాడికి నిరసనగా శనివారం హైకోర్టు బార్ కౌన్సిల్ ముందు తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన జరిగింది. నిరసనలో భాగంగా తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, నవీన్ కుమార్ వాసిరెడ్డి మాట్లాడుతూ.. సిద్దిపేటలో న్యాయవాది అశోక్‌పై జరిగిన దాడి హేయమైన చర్య అని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు ఎక్కువ అయ్యాయని, దాడులను నివారించడానికి న్యాయవాదుల రక్షణ చట్టం ఎంతో అవసరమని అన్నారు. పరిస్థితుల తీవ్రతను గమనించి ప్రభుత్వం తక్షణమే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమల్లోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రభాకర్, మని తేజ, నవీన్ పోగుల, రామకృష్ణ, పూర్ణలతో పాటు పెద్ద ఎత్తున న్యాయవాదులు పాల్గొన్నారు.



# రాయికల్‌లో 7 కోట్ల పనులకు భూమిపూజ

రాయికల్, జనవరి 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో రూ.7.2 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భూమి పూజ చేశారు. మహిళా సంఘాలకు రూ.11 లక్షల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశారు. అంతకుముందు మార్కండేయ ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పద్మశాలి సేవా సంఘం లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ రాజా గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, ఆర్డీవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



# కొండగట్టు భక్తుల కోసం ఎలక్ట్రిక్ ఆటో వితరణ

**వెన్సా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధినేతల దాతృత్వం**

మల్యాల, జనవరి 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల కోసం ఓ ఎలక్ట్రిక్ ఆటోను వెన్సా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధినేతలు పీ రాందేవ్ రావు, లక్ష్మణ్ రావు విరాళంగా అందజేశారు. కొండగట్టు ఆలయ చెక్ పోస్ట్ నుంచి దేవాలయం వరకు భక్తలను తీసుకెళ్లేందుకు వీలుగా ఈ ఆటోను అందజేస్తున్నట్లు తెలిపారు. శనివారం ఆలయ ఈవో శ్రీకాంతారావుకు వారు ఆటోను అందజేశారు.




# కుక్క కరిచినా చికిత్స అందించలేరా

**మల్యాల ప్రభుత్వ దవాఖానలో వసతుల లేమి**

**బాలుడిపై కుక్కల దాడి.. జగిత్యాలకు తరలింపు**

మల్యాల, జనవరి 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు ఎంత దయనీయంగా ఉన్నాయో తెలిపే ఘటన శనివారం చోటుచేసుకుంది. అగంతపు అశ్విత్ (7) అనే బాలుడు ఆటుకుంటుండగా, కుక్క కరిచింది. తల్లిదండ్రులు ఆ బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స, సదుపాయాలు లేకపోవడం గమనార్హం. దీంతో చేసేదేమీ లేక.. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది. గత రెండేళ్లుగా మండల కేంద్రంలో కుక్కలు, కోతుల బెడద ఎక్కువైంది. అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాజాగా, కొత్త పాలకవర్గం కొలువుదీరడంతో ఇకపైనా ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

# యువతకు భరోసా ఉద్యోగ మేళా

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**ఎన్ఐఎస్ఏలో 18వ విడత ఉద్యోగ మేళా**



హైదరాబాద్, జనవరి 24 (పీఐబీ): హైదరాబాద్‌లోని హకీంపేటలో ఉన్న నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీలో (ఎన్ఐఎస్ఏ) శనివారం జరిగిన 18వ ఉద్యోగ మేళాకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరయ్యారు. వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలకు కొత్తగా ఎంపికైన వారికి ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ యువత పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అపారమైన శ్రద్ధ, ప్రేమ ఉన్నాయన్నారు. ఇంతకు ముందు నిర్వహించిన 17 ఉద్యోగ మేళాల ద్వారా యువతకు 11 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను ప్రభుత్వం అందించిందని ఆయన పేర్కొన్నారు. 18వ ఉద్యోగ మేళాలో భాగంగా దేశవ్యాప్తంగా మరో 61,000 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఉద్యోగ మేళా అనేది భరోసా, ఆత్మవిశ్వాసం, బలాన్ని ఇచ్చే వేదికగా నిలుస్తుందని.. ఇది వారు చదువులు, వృత్తిని అంకితభావంతో కొనసాగించేలా ప్రేరేపిస్తుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తూ సకాలంలో నియామకాలను చేపడుతోందని తెలిపారు. ఒక్క ఆరోపణ కూడా లేకుండా 11 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను అందించడం.. నియామక ప్రక్రియ పారదర్శకత, నిష్పక్షపాత, విశ్వసనీయతను తెలియజేస్తోందని అన్నారు. కేవలం జీతం కోసమే కాకుండా దేశం, సమాజానికి అంకితభావం, స్ఫూర్తితో సేవ చేయాలని ఎంపికైన కొత్త ఉద్యోగులను శ్రీ బండి సంజయ్ కుమార్ కోరారు. వికసిత్ భారత్ – 2047 దార్శనికతతో దేశాన్ని అభివృద్ధి చెందినదిగా మార్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ జాతీయ లక్ష్యాన్ని సాధించడంలో కొత్త ఉద్యోగులు చురుగ్గా సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ డీపీ పరిహార్, ఎన్ఐఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ దామోర్ పాల్గొన్నారు.

# నెక్స్ట్‌జెన్ ఏఐ గ్రోత్ శిక్షణ విజయవంతం

హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): రియల్ ఎస్టేట్ రంగంలో ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించేందుకు ఉద్దేశించిన "నెక్స్ట్‌జెన్ ఏఐ గ్రోత్ ఫర్ ప్రాప్‌టెక్ & రియల్ ఎస్టేట్" శిక్షణా కార్యక్రమం హైదరాబాద్‌లోని టి–హబ్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన సుమారు 250 మంది స్వతంత్ర ఛానల్ పార్ట్‌నర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ శిక్షణలో ఆధారిత సేల్స్, డిజిటల్ మార్కెటింగ్ ద్వారా లీడ్స్ పెంపు, కస్టమర్ ట్రస్ట్ బిల్డింగ్, సైట్ విజిట్ కన్వర్షన్ మెరుగుదల వంటి అంశాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ డాక్యుమెంటేషన్ స్పష్టత, అప్రూవల్స్ వెరిఫికేషన్, ఖర్చుల విభజన వివరాలను స్పష్టంగా చూపించే "ప్రూఫ్ – ప్రెజెన్స్ – ప్రాసెస్" ఫ్రేమ్‌వర్క్ ను ప్రత్యేకంగా పరిచయం చేశారు. అలాగే ఏఐ టూల్స్ సహాయంతో రీల్స్ స్క్రిప్ట్స్, పోస్టర్ కంటెంట్, అడ్స్ కాపీ, ఫాలో–అప్ మెసేజెస్ వేగంగా రూపొందించే విధానాలను లైవ్ డెమో ద్వారా వివరించారు.



# వాటర్ హబ్‌గా చొప్పదండి!

**రైతులను ఏ కష్టం రాకుండా కాపాడుకుంటాం**

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం వెల్లడి**

**నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటి విడుదల**

గంగాధర, జనవరి 24 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గం లోని రైతులకు ఏ కష్టం రాకుండా కడుపులో పెట్టి కాపాడుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ కు శనివారం నీటిని విడుదల చేయడంతో కాంగ్రెస్ నాయకులతో కలిసి రిజర్వాయర్ పంపుల వద్ద ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు చేసి గోదావరి జలాలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలో చివరి మడి వరకు సాగునీరు అందించి పంటలు ఎండిపోకుండా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. రైతులు కోరకముందే వారి అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని జనవరి మాసంలోనే సాగు నీటిని విడుదల చేయించినట్లు తెలిపారు. గత బి ఆర్ ఎస్ పాలనలో పంటలకు నీళ్లు అందించాలని ధర్నాలు, రాస్తారోకాలు చేస్తే అక్రమ కేసులు పెట్టి, అర్ధరాత్రి అరెస్టులు చేశారని గుర్తు చేశారు. రైతులకు నీళ్లు ఇవ్వకుండా అరిగోస పెట్టారని గుర్తు చేశారు. మార్చి నెల కంటే ముందు నీళ్లు విడుదల చేసిన పరిస్థితి ఆనాడు లేదని ఎద్దేవా చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రెండేళ్లలో జనవరి మాసంలోనే ముందస్తుగా సాగునీటిని విడుదల చేయించినట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గాన్ని వాటర్ హబ్ గా మార్చుతామని స్పష్టం చేశారు. నారాయణపూర్ రిజర్వాయర్ నిర్వాసితులను అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. ఇప్పటికే రూ లో. 23.50 కోట్లు మంజూరు చేయించినట్లు. రానున్న రోజుల్లో 20 కోట్లు మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. సంబంధిత భూసేకరణ పనులను వేగవంతం చేయించి నిర్వాసితులకు పరిహారం అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాను కోరగానే ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి నారాయణపూర్ రిజర్వాయర్కు వారి జలాలను విడుదల చేయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ వెలిచాల తీర్మల్ రావు , సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, సర్పంచ్లు దీకొండ బాబ లక్ష్మి మధు,ఎడవెల్లి శశిధర్ రెడ్డి, వేముల భాస్కర్, పడాల రాజన్న, రేండ్ల శ్రీనివాస్,బారరాజు ప్రభాకర్ రెడ్డి, బాస వేణి శ్రీనివాస్, బిర్ల ఆనంద్, తిరుపతి, నాయకులు దుబ్బాసి బుచ్చయ్య,సాగి అజయ్ రావు, బుర్గు గంగన్న రోమాల రమేశ్ రైతులు పాల్గొన్నారు.

# వద్దిరాజుకు నవీన్ పటేల్ జన్మదిన శుభాకాంక్షలు

జూబ్లీహిల్స్/హైదరాబాద్, జనవరి 24 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోగుల నవీన్ కుమార్ పటేల్ ఘనంగా సత్కరించి, పూల బొకే అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. తన జన్మదిన వేడుకలకు హాజరైన వారందరికి ఎంపీ వద్దిరాజు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేఎన్ రెడ్డి, రామకృష్ణ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# సూర్య ధన్వంతరి ఆలయంలో ఘనంగా పూజలు

జగిత్యాల టౌన్, జనవరి 24 (ఈవార్తలు): రథసప్తమి సూర్యజయంతి సందర్భంగా కొనసాగుతున్న ఉత్సవాలు జగిత్యాలలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో మూడో రోజు శనివారం ఘనంగా జరిగాయి. స్వామివారి ఉత్సవ మూర్తులను వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ అండ్ చైర్మెన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, మేనేజింగ్ ట్రస్ట్ గట్టు రాజేందర్, అధ్యక్షుడు ముత్యాల రాంలింగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్, కోశాధికారి వడ్లగట్ట స్వాతి, సహాయ కోశాధికారి వడ్లగట్ట గోపి, ధర్మకర్తలు వొడ్నాల లత, భారతాల గీత, తిరుపతి, అర్చకులు ప్రణయ్ కుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.






# అమెరికాలో 8,000 విమానాలు రద్దు

న్యూయార్క్: అమెరికా చరిత్రలోనే అత్యంత తీవ్రమైన మంచు తుపానుల్లో ఒకటి దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. టెక్సాస్ నుంచి న్యూ ఇంగ్లాండ్ వరకు సుమారు 2,000 మైళ్ల విస్తీర్ణంలో ఈ తుపాను ప్రభావం చూపుతుండటంతో అగ్రరాజ్యం గజగజ వణికిపోతోంది. దాదాపు 20 కోట్ల మందికి పైగా ప్రజలు శీతల వాతావరణం, మంచు హెచ్చరికల నీడలో జీవిస్తున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాషింగ్టన్ డీసీతో పాటు అలబామా, జార్జియా, కెంటకీ, న్యూయార్క్, టెక్సాస్ సహా 16కు పైగా రాష్ట్రాలు ఇప్పటికే స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించాయి. ఆర్కిటిక్ ప్రాంతం నుంచి పోలార్ వోర్టెక్స్ కారణంగా దూసుకొస్తున్న అతి శీతల గాలులు, శక్తివంతమైన తుపాను వ్యవస్థతో కలవడంతో ఈ విపత్కర పరిస్థితి ఏర్పడింది. దీని ఫలితంగా దేశంలోని తూర్పు భాగమంతా భారీ హిమపాతం, గడ్డకట్టే వర్షం (ఫ్రీజింగ్ రెయిన్), స్లీట్ (మంచుతో కూడిన వర్షం)తో అల్లకల్లోలంగా మారింది. ముఖ్యంగా సదరన్ ప్లెయిన్స్, లోయర్ మిసిసిపీ వ్యాలీ, టెన్నెస్సీ వ్యాలీ, ఆగ్నేయ రాష్ట్రాల్లో కొన్నిచోట్ల "విపత్తు స్థాయి"లో మంచు పేరుకుపోయే ప్రమాదం ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం హెచ్చరించింది. "ఇది చాలా తీవ్రమైన తుపాను" అని యూఎస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ వాతావరణ శాస్త్రవేత్త జాకబ్ ఆషర్‌మాన్ అభివర్ణించారు. ఈ మంచు తుపాను కారణంగా దేశవ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. విమాన ప్రయాణాలపై తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ అవేర్ డేటా ప్రకారం, ఈ వారాంతంలో (శని, ఆదివారాలు) ఇప్పటివరకు 8,000కు పైగా విమానాలను రద్దు చేశారు. డెల్టా, అమెరికన్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి ప్రధాన సంస్థలు ప్రయాణ హెచ్చరికలు జారీ చేసి, టికెట్ మార్పు రుసుములను రద్దు చేశాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ కూడా టెక్సాస్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోవచ్చని హెచ్చరించింది. మంచు ప్రభావం కేవలం ప్రయాణాలకే పరిమితం కాలేదు. గడ్డకట్టే వర్షం కారణంగా విద్యుత్ తీగలపై అంగుళం మందం వరకు మంచు పేరుకుపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల విద్యుత్ లైన్లు తెగిపోయి, చెట్లు కూలిపోయి సుదీర్ఘకాలం పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్సాస్‌లో ఇప్పటికే దాదాపు 20,000 మంది, ఓక్లహోమా, ఆర్కాన్సాస్‌లలో వేలాది మంది విద్యుత్ లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. 2021 నాటి విద్యుత్ సంక్షోభం నుంచి పాఠాలు నేర్చుకున్నామని, ఈసారి విద్యుత్ గ్రిడ్‌ను సిద్ధంగా ఉంచామని టెక్సాస్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ దాదాపు 30 సహాయక బృందాలను సిద్ధంగా ఉంచింది. ఆహారం, దుప్పట్లు, జనరేటర్లను కీలక ప్రాంతాలకు తరలించింది. పలు రాష్ట్రాల్లో నేషనల్ గార్డ్ దళాలను మోహరించారు. వాషింగ్టన్ డీసీ మేయర్ మురియల్ బౌజర్ మాట్లాడుతూ, "మేము అధికారికంగా స్నో ఎమర్జెన్సీ, స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించాం" అని తెలిపారు. చికాగోలో పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, లూసియానాలో కార్నివాల్ పరేడ్‌లు, నాష్‌విల్లేలో పలు కార్యక్రమాలు రద్దయ్యాయి. ఈ తుపాను సోమవారం వరకు కొనసాగి, న్యూయార్క్, బోస్టన్ వంటి ప్రధాన నగరాలపై ప్రభావం చూపనుంది. తుపాను తగ్గుముఖం పట్టినా, ఆ తర్వాత కూడా అత్యంత శీతల గాలులు, ప్రమాదకరమైన వాతావరణం కొనసాగుతుందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్

**అత్యధిక యువత మన దేశంలోనే: ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ: భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు. రోజ్‌గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని ఆయన వెల్లడించారు. యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## 2047 నాటికి 350 ఎయిర్ పోర్టులు

న్యూఢిల్లీ: 2047 నాటికి దేశంలోని విమానాశ్రయాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 164 నుండి 350కి పెంచడమే లక్ష్యమని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆయన మాట్లాడుతూ, భారత విమానయాన సంస్థలు ఇప్పటికే 1,700 కొత్త విమానాల కోసం ఆర్డర్లు ఇచ్చాయని, వీటి రాకతో దేశీయ విమానయాన సామర్థ్యం మూడు రెట్లు వృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఏటా 10 నుండి 12 శాతం వృద్ధిరేటుతో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్‌గా ఎదగడమే కాకుండా, మూడో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించిందని ఆయన వివరించారు. దేశీయంగా తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించడం ద్వారా గ్లోబల్ సప్లై చైన్‌లో భారత్ కీలక భాగస్వామిగా మారనుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# 27న బ్యాంకుల సమ్మె

**5 రోజుల పనిదినాలు అమలు చేయాలని డిమాండ్.. 9 సంఘాల ఐక్యవేదిక యూఎఫ్ బీఏ సమ్మెకు పిలుపు**




న్యూఢిల్లీ: వారానికి 5 రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశంలోని ప్రధాన బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. జనవరి 27న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్ బీయూ) ప్రకటించింది. ఈ సమ్మె కారణంగా ఆ రోజు బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఎన్డీటీవీ ప్రాఫిట్ నివేదిక ప్రకారం, జనవరి 26 అర్ధరాత్రి నుంచి 27 అర్ధరాత్రి వరకు ఈ సమ్మె జరగనుంది. తొమ్మిది బ్యాంకు సంఘాల ఉమ్మడి వేదిక అయిన యూఎఫ్ బీయూ, ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్-1947 ప్రకారం ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ), చీఫ్ లేబర్ కమిషనర్, ఆర్థిక సేవల విభాగానికి (డీఎఫ్ఎస్) సమ్మె నోటీసు పంపింది. బ్యాంకులకు అన్ని శనివారాలు సెలవు దినాలుగా ప్రకటించి, 5 రోజుల పని విధానాన్ని అమలు చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని యూనియన్లు స్పష్టం చేశాయి. ఇప్పటికే ఈ ప్రతిపాదనకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) ఆమోదం తెలిపి ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని యూనియన్లు గుర్తుచేశాయి. 2023 డిసెంబర్ 7న ఐబీఏ, యూఎఫ్ బీయూ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు ఈ సిఫార్సు జరిగింది. అయితే, ప్రభుత్వ నియంత్రణ సంస్థల నుంచి తుది ఆమోదం లభించడంలో తొమ్మిది నెలలకు పైగా జాప్యం జరుగుతోందని, ఈ కారణంగానే తాము మళ్లీ ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందని యూఎఫ్ బీయూ తెలిపింది. పనిదినాలు తగ్గినా, మొత్తం పనిగంటలు తగ్గకుండా ఉండేందుకు రోజువారీ పనివేళలను 40 నిమిషాలు పెంచేందుకు కూడా యూనియన్లు అంగీకరించడం గమనార్హం.

# గాలి జనార్దన్ రెడ్డి భవనానికి నిప్పు



బళ్లారి: కర్ణాటక రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. బీజేపీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త గాలి జనార్దన్ రెడ్డికి చెందిన ఓ భవనాన్ని దుండగులు దగ్ధం చేశారు. బళ్లారి కంటోన్మెంట్ ప్రాంతంలో నిన్న సాయంత్రం ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటన వెనుక కాంగ్రెస్ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి మద్దతుదారులు ఉన్నారని గాలి జనార్దన్ రెడ్డి సోదరుడు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర రెడ్డి ఆరోపించారు. భవనంపై పెట్రోల్, డీజిల్ పోసి ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ నెల 1న గాలి జనార్ధన్ రెడ్డి ఇంటి వద్ద భరత్ రెడ్డి వర్గీయులు కాల్పులకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఆ వివాదం సద్దుమణగక ముందే ఇప్పుడు ఈ అగ్నిప్రమాదం జరగడం గమనార్హం. బళ్లారి నగరంలోని జీ స్క్వేర్ లేఅవుట్లో ఉన్న ఈ మోడల్ హౌస్ విలువ సుమారు రూ. 3 కోట్లు ఉంటుందని అంచనా. 13 ఏళ్ల క్రితం కొనుగోలుదారులను ఆకర్షించేందుకు దీనిని నిర్మించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల కోసం గాలి జనార్దన్ రెడ్డి బెంగళూరులో ఉన్నారు. ఈ ఘటనపై ఆయన స్పందిస్తూ, ఇటీవల బ్యానర్ల గొడవ తర్వాత ఈ ప్రమాదం జరగడం అనుమానాలకు తావిస్తోందన్నారు. బళ్లారి ఎస్పీతో మాట్లాడానని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ ఘటనతో బళ్లారిలో ఇరువర్గాల మధ్య రాజకీయ వైరం మరింత ముదిరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# భార్య సహా నలుగురిని కాల్చివేత

**అమెరికాలో భారత సంతతి వ్యక్తి దారుణం**



న్యూయార్క్: అమెరికాలోని జార్జియాలో అత్యంత దారుణ ఘటన చోటుచేసుకుంది. భారత సంతతికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా తన భార్య సహా నలుగురిని కాల్చి చంపాడు. గ్విన్నెట్ కౌంటీలోని లారెన్స్‌విల్లే ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ విషాదం జరిగింది. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి హత్య కేసులు నమోదు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం అట్లాంటాకు చెందిన విజయ్ కుమార్ (51) ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. మృతులను అతని భార్య మీమూ డోగ్రా (43), బంధువులైన గౌరవ్ కుమార్ (33), నిధి చందర్ (37), హరీష్ చందర్ (38)గా గుర్తించారు. ఈ ఘటనపై అట్లాంటాలోని భారత కాన్సులేట్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మృతుల్లో ఒకరు భారత జాతీయుడు ఉన్నారని, బాధిత కుటుంబానికి అన్ని విధాలా సహాయం అందిస్తామని ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఈ ఘటన జరిగినప్పుడు ఇంట్లో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారు. కాల్పుల శబ్దం విన్న వారు భయంతో ఓ క్లోజెట్‌లో దాక్కున్నారు. వారిలో ఓ చిన్నారి సమయస్ఫూర్తితో 911కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. పిల్లలు ముగ్గురూ సురక్షితంగా ఉన్నారని, వారిని బంధువులకు అప్పగించామని అధికారులు తెలిపారు. అట్లాంటాలోని ఇంట్లో విజయ్ కుమార్‌కు, అతని భార్యకు మధ్య వాగ్వాదం మొదలైనట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. అనంతరం వారు తమ 12 ఏళ్ల కుమారుడితో కలిసి లారెన్స్‌విల్లేలోని బంధువుల ఇంటికి వెళ్లగా, అక్కడ ఈ దారుణం జరిగింది. నిందితుడు విజయ్ కుమార్‌పై నాలుగు హత్య కేసులు, చిన్నారుల పట్ల క్రూరంగా ప్రవర్తించినందుకు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## విదేశాల్లో 70 మంది వాంటెడ్ ఇండియన్స్



న్యూఢిల్లీ : గత రెండేళ్లలో వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నట్లు గుర్తించామని కేంద్ర ప్రభుత్వం ఒక నివేదికలో తెలిపింది. వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి, పరారీలో ఉన్న వారిని గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందని వెల్లడించింది. అదే సమయంలో ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. పరారీలో ఉన్న వారిని విదేశాల్లో ఇంత పెద్ద మొత్తంలో గుర్తించడం గత దశాబ్ద కాలంలో ఇదే మొదటిసారి అని తెలిపింది. వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గత సంవత్సరం విదేశాల నుంచి తిరిగి వచ్చారని భారత ప్రభుత్వం వెల్లడించింది. సీబీఐ కేసులకు సంబంధించి ఏడాది వ్యవధిలో 74 రొగేటరీ లెటర్స్ పంపించినట్లు తెలిపింది. దర్యాప్తునకు సహకరించాలని విదేశీ న్యాయస్థానాలకు రాసే లేఖను రొగేటరీ లెటర్స్ అంటారు. ఈ లేఖల్లో 54 సీబీఐ, మరో 20 రాష్ట్ర దర్యాప్తు బృందాలు రాసినట్లు పేర్కొంది.

## జపాన్‌లోనూ త్వరలో యూపీఐ సేవలు

**భారత పర్యాటకులకు శుభవార్త**

టోక్యో: భారతదేశపు విజయవంతమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) తన సేవలను మరో దేశానికి విస్తరించనుంది. నిక్కీ ఆసియా నివేదిక ప్రకారం, త్వరలో జపాన్‌లో కూడా యూపీఐ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం జపాన్‌కు చెందిన ప్రముఖ ఐటీ సంస్థ ఎన్‌టీటీ డేటా... నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. జపాన్‌కు వెళ్లే భారత పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో వారికి చెల్లింపులను సులభతరం చేయడమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం. 2025లో సుమారు 3.15 లక్షల మంది భారతీయులు జపాన్‌ను సందర్శించారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 35 శాతం అధికం. ఈ క్రమంలో, 2026 ఆర్థిక సంవత్సరంలో జపాన్‌లో యూపీఐ ట్రయల్స్ నిర్వహించాలని ఎన్‌టీటీ డేటా, ఎన్‌పీసీఐ ప్రణాళికలు రచిస్తున్నాయి. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే, భారత పర్యాటకులు జపాన్‌లోని దుకాణాల్లో తమ యూపీఐ యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నేరుగా చెల్లింపులు చేయవచ్చు. ఈ మొత్తం వారి భారత బ్యాంకు ఖాతాల నుంచి డెబిట్ అవుతుంది. భారత్, జపాన్ పేమెంట్ నెట్‌వర్క్‌లను అనుసంధానించే ప్రక్రియపై ఇరు సంస్థలు పనిచేస్తున్నాయి. 2016లో ప్రారంభమైన యూపీఐ, భారత్‌లో అత్యంత ప్రజాదరణ పొందింది. ఇప్పటికే భూటాన్, సింగపూర్, ఫ్రాన్స్, యూఏఈ సహా 8 దేశాల్లో యూపీఐ సేవలను ప్రవేశపెట్టారు. ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా అంతర్జాతీయ ద్రవ్య నిధి యూపీఐని అభివర్ణించిన విషయం తెలిసిందే.

## రిపబ్లిక్ డే అతిథిగా ఉర్సులా వాన్ డెర్ లేయెన్

న్యూయార్క్: భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ శనివారం ఢిల్లీకి చేరుకున్నారు. ఆమెతో పాటు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో లూయిస్ శాంటోస్ డా కోస్టా కూడా ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటన ఇరుపక్షాల సంబంధాలలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. ఢిల్లీ విమానాశ్రయంలో ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌కు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద స్వాగతం పలికారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్యాలైన భారత్, ఈయూల మధ్య పరస్పర విశ్వాసం, భాగస్వామ్య విలువలతో బంధం బలపడుతోందని భారత విదేశాంగ శాఖ ఈ సందర్భంగా ఎక్స్ లో పేర్కొంది. ఈ పర్యటనలో భాగంగా ఈయూ విదేశాంగ విధాన చీఫ్ కజా కల్లాస్ కూడా ఢిల్లీకి వచ్చారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అనిశ్చితి నెలకొన్న తరుణంలో ఈయూ నేతల పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. కొద్ది రోజుల క్రితం విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈయూ దేశాల రాయబారులతో సమావేశమయ్యారు. బలమైన భారత్-ఈయూ భాగస్వామ్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించగలదని, సరఫరా గొలుసులను పటిష్టం చేయగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు వస్తున్న ఈయూ నేతలు.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అవుతారు. జనవరి 27న జరగనున్న 16వ భారత్-ఈయూ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీతో కలిసి పాల్గొంటారు. ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య వాణిజ్యం, భద్రత, సాంకేతికత వంటి అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి. దీంతో పాటు భారత్-ఈయూ బిజినెస్ ఫోరమ్‌ను కూడా నిర్వహించనున్నారు.

## నేనేం తప్పుచేయలేదు

**పార్టీ లైన్‌లోనే ఉన్నా: శశిథరూర్**

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఢిల్లీలో నిర్వహించిన కీలక సమావేశానికి తాను గైర్హాజరు కావడంపై వస్తున్న ఊహాగానాలకు సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ తెరదించారు. దీని వెనుక ఎలాంటి రాజకీయ కారణాలు లేవని, సమావేశానికి హాజరు కాలేనని పార్టీ నాయకత్వానికి ముందే సమాచారం ఇచ్చానని ఆయన స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా శుక్రవారం ఢిల్లీలో కేరళ కాంగ్రెస్ నేతలతో పార్టీ కేంద్ర నాయకత్వం ఒక సమావేశం నిర్వహించింది. ఈ భేటీకి థరూర్ హాజరు కాకపోవడంతో పార్టీలో విభేదాలున్నాయంటూ మరోసారి మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. ఇటీవల కొచ్చిలో రాహుల్ గాంధీ పాల్గొన్న ఒక సమావేశంలో తనకు ఎదురైన అనుభవంతో థరూర్ అసంతృప్తిగా ఉన్నారని, అందుకే ఢిల్లీ సమావేశానికి రాలేదని కథనాలు వెలువడ్డాయి. దానికి తోడు, కేరళలో ప్రధాని మోదీ పర్యటన కూడా ఉండడంతో, కాంగ్రెస్ హై లెవల్ భేటీకి థరూర్ డుమ్మా కొట్టారని వార్తలు వచ్చాయి. ఈ ప్రచారంపై శనివారం కోజికోడ్‌లో మీడియాతో మాట్లాడుతూ థరూర్ స్పందించారు. "నేను చెప్పాలనుకున్నది పార్టీ నాయకత్వానికి చెప్పాను. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా చర్చించడం సరికాదు" అని అన్నారు. మీడియాలో వచ్చే వార్తల్లో కొన్ని నిజాలు, కొన్ని అబద్ధాలు ఉండవచ్చని... దేన్నీ గుడ్డిగా నమ్మవద్దని సూచించారు. ఢిల్లీ సమావేశానికి రాలేకపోవడానికి గల కారణాన్ని వివరిస్తూ, "కోజికోడ్‌లో నా తాజా పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉంది. ఈ సాహిత్య ఉత్సవానికి హాజరు కావాల్సి ఉన్నందున ఢిల్లీ రాలేనని ముందే హైకమాండ్ కు తెలియజేశాను. గతంలో రాజకీయ కార్యక్రమాల వల్ల జైపూర్ సాహిత్య ఉత్సవాన్ని వదులుకున్నాను. ఈసారి అలా జరగకూడదనే ఇక్కడికి వచ్చాను" అని థరూర్ వివరించారు. ఈ విషయంపై సీడబ్ల్యూసీ సభ్యుడు రమేశ్ చెన్నితాల కూడా స్పందిస్తూ.. థరూర్ కేవలం రాజకీయ నాయకుడే కాదని, గొప్ప సాహిత్యవేత్త అని, ఈ విషయాన్ని ఆ కోణంలోనే చూడాలని అన్నారు.

## భారత్‌పై తగ్గనున్న ట్రంప్ టారిఫ్‌లు

వాషింగ్టన్: భారత్ పై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్ లు తగ్గించే యోచనలో ఉన్నట్లు అగ్రరాజ్యం సంకేతాలు వెలువరించింది. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నందుకు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై 25 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రతీకార సుంకాలు 25 శాతం కలిపి మొత్తంగా మన దేశంపై 50 శాతం సుంకాలు విధించారు. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తుసేవలపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం సుంకాలు వసూలు చేస్తోంది. అయితే, ఇటీవల రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించింది. దీంతో అమెరికా సుంకాలు సగానికి తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విషయాన్ని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

## భారత్‌ను తక్కువచేసి చూపొద్దు

**విదేశీ వ్లాగర్లపై కెనడా మహిళ ఫైర్**

ఒట్టావా: భారత్‌ను పేద దేశంగా, గందరగోళ ప్రదేశంగా చిత్రీకరిస్తున్న విదేశీ కంటెంట్ క్రియేటర్ల తీరుపై ఓ కెనడియన్ మహిళ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేవలం పేదరికాన్ని, రద్దీ ప్రాంతాలనే లక్ష్యంగా చేసుకుని వీడియోలు తీయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించింది. ఈ అంశంపై ఆమె మాట్లాడిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చాలామంది విదేశీ వ్లాగర్లు యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ కోసం భారత్‌కు వచ్చి, కేవలం పాత ఢిల్లీ వంటి ప్రాంతాల్లోని పరిస్థితులనే చిత్రీకరించి మొత్తం దేశం ఇలాగే ఉంటుందనే అభిప్రాయం కల్పిస్తున్నారని ఆమె ఆరోపించింది. ఇలాంటి చిత్రణ చాలా దారుణమని, ఇది భారతీయులపై ప్రపంచవ్యాప్తంగా జాత్యహంకారాన్ని పెంచుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర దేశాల విషయంలో ఇలాంటి పక్షపాత ధోరణి ఉండదని, ఉదాహరణకు వియత్నాం వెళ్లినప్పుడు అక్కడి అందమైన ప్రదేశాలనే చూపిస్తారు తప్ప, అత్యంత పేదరికాన్ని ఫోకస్ చేయరని ఆమె గుర్తుచేశారు. తన భారత పర్యటన అనుభవాన్ని పంచుకుంటూ, ఢిల్లీలోని ఓ విలాసవంతమైన హోటల్‌లో తనకు ప్రపంచ స్థాయి సేవలు అందాయని, ఇక్కడి ఆతిథ్య రంగం అద్భుతమని ప్రశంసించారు.

## వయ్యారి చిత్రం




అనన్య నాగళ్ల



# ప్రభాస్ స్పిరిట్‌లో గోపీచంద్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లీడ్ రోల్ లో టాలెంటెడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా స్పిరిట్ మూవీని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికీ అటు అభిమానుల్లో.. ఇటు సినీ ప్రియుల్లో భారీ అంచనాలు క్రియేట్ చేసుకున్న ఆ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే సినిమాలో ప్రభాస్.. పోలీస్ ఆఫీసర్ గా కనిపించనున్నారు. తొలిసారి ఆ రోల్ లో సందడి చేయనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి డిమ్రీ యాక్ట్ చేస్తున్నారు. వారిద్దరితోపాటు ప్రకాష్ రాజ్, కాంచన కీలక పాత్రలు పోషిస్తున్నారు. అయితే మిగతా కీలక పాత్రల గురించి మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో తాజాగా మరో ఆసక్తికర ప్రచారం తెరపైకి వచ్చింది. స్పిరిట్ లో మ్యాచో స్టార్ గోపీచంద్ ఒక ముఖ్యమైన పాత్రలో నటించబోతున్నారనే వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే ప్రభాస్, గోపీచంద్ గతంలో వర్షం సినిమాలో కలిసి నటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో ఇద్దరికీ మంచి పేరు వచ్చింది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ఆ కాంబినేషన్ తెరపై కనిపించబోతుందనే వార్త ఇప్పుడు చక్కర్లు కొడుతోంది. ఆ సినిమాలో గోపీచంద్ విలన్ గా నటిస్తారా లేక హీరోకి సపోర్టింగ్ రోల్ చేస్తారా అనే విషయంపై స్పష్టత లేదు. అయితే మేకర్స్ నుంచి మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.





## బాడీ షేమింగ్‌కు గురయ్యా: ఈషా రెబ్బా

హీరోయిన్ ఈషా రెబ్బా తన కెరీర్ స్టార్టింగ్ లో ఎదుర్కొన్న బాడీ షేమింగ్ ఎక్స్పీరియన్స్ ను తలుచుకుని కాస్త ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న తాజా చిత్రం ఓం శాంతి శాంతి శాంతి జనవరి 23వ తేదీన థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతుండటంతో ప్రమోషన్లలో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె గతంలో తనకు ఎదురైన ఒక చేదు సంఘటనను ప్రేక్షకులతో పంచుకున్నారు. సినిమాల్లోకి కొత్తగా అడుగుపెట్టిన రోజుల్లో ఒక నిర్మాత తన ఫోటోలను ల్యాప్ టాప్ లో జూమ్ చేసి చూసి, నీ మోచేతులు డార్క్ గా ఉన్నాయి.. ఇంకా ఫెయిర్ గా ఉండాలి అంటూ తన ముందే వ్యాఖ్యానించారని ఈషా రెబ్బా తెలిపారు. ఆ మాటలు తన మనసును చాలా బాధించాయని, దాని వల్ల కొంతకాలం వరకు తీవ్రంగా నిరుత్సాహానికి లోనయ్యానని చెప్పారు. ఆ సమయంలో ఆ వ్యక్తికి ఏం సమాధానం చెప్పాలో కూడా తెలియక మౌనంగా ఉండిపోయానని గుర్తు చేసుకున్నారు. అయితే తన పుట్టుకతో వచ్చిన రంగును మార్చుకోలేనని, అయినా అప్పట్లో ఆ వ్యాఖ్యలు తన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయని ఈషా పేర్కొన్నారు. అప్పుడు పరిశ్రమలో ఇలాంటి విషయాలు సాధారణమేనని కూడా తనకు తెలియదని చెప్పారు. అందుకే చాలా ఎమోషనల్ అయ్యానని చెప్పిన ఈషా.. ఆ తర్వాత తనను తాను అంగీకరించడం నేర్చుకున్నట్లు వెల్లడించారు.

## 2026లో తమన్నా కొత్త ప్లాన్లు!

మిల్కీబ్యూటీ తమన్నా..నటిగా బాలీవుడ్ లో తనదైన ముద్ర వేయాలని అడుగులు వేస్తోంటట. ఈనేపథ్యంలోనే బాలీవుడ్‌లో ప్రతిష్టాత్మక చిత్రాల్లో అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. సంజయ్ లీలా భన్సాలీ నిర్మిస్తున్నఓ సినిమాతో పాటు, కరీనా కపూర్ క్రూ 2, గోల్‌మాల్ 5, మడాక్ ఫిలిమ్స్ హారర్–కామెడీ యూనివర్స్ భాగమవ్వాలని ప్రయత్నాలు చేస్తోందిట. ఇప్పటికే ఆ చిత్రాల దర్శక, నిర్మాతలకు టచ్ లోకి వెళ్లిందిట. ఈ నేపథ్యంలో మరో ఇంట్రెస్టింగ్ విషయం కూడా లీకైంది. కార్తీక్ ఆర్యన్ నటిస్తోన్న నాగ్ జిల్లా ప్రాజెక్ట్ ను తమన్నా కావాలనే వదులుకుందంటున్నారు. ఈ ఛాన్స్ వదలుకోవడం వెనుక ఓ మాస్టర్ ప్లాన్ ఉందిట.ప్రస్తుతం తమన్నా షాహిద్ కపూర్ హీరోగా నటిస్తోన్న ఓ రోమియోలో నటిస్తోంది. అలాగే సిద్దార్ద్ మల్హోత్రా ప్రాజెక్ట్ వ్యాన్ లోనూ నటిస్తోంది. ముంబై మాజీ కమీషనర్ రాకేష్ మరియా బయోపిక్లోనూ నటిస్తోంది.



## ముసలోడు వేధించాడు

ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్‌కి తాతల వయసున్న వ్యక్తుల నుంచి వేధింపులు ఎదురయ్యాయట. హర్యానాలోని కర్నాల్ లో జరిగిన ఒక వివాహ వేడుకలో అసహ్యకరమైన అనుభవం ఎదురయిందని తెలిపింది. 'నేను ప్రదర్శన ఇవ్వడానికి స్టేజ్‌పైకి వెళ్తున్న సమయంలో కొంతమంది పురుషులు, వృద్ధులు ఫోటోలు తీసే నెపంతో నాపై అసభ్యకరంగా ప్రవర్తించారు. నడుముపై చేతులు వేయడం, దగ్గరకు వచ్చి అనుచితంగా తాకడం వంటి చర్యలు నన్ను తీవ్రంగా మనస్థాపానికి గురిచేసాయి. ముఖ్యంగా నేను వద్దని చెప్పినా వాళ్ళు వెనక్కి మాత్రం తగ్గలేదు. ఇది చాలా అవమానకరంగా అనిపించింది' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది మౌని రాయ్.

## జాన్ అబ్రహాంలో టాలెంట్ లేదు

హిందీ బిగ్‌బాస్ సీజన్ 9లో పాల్గొన్న నటి రిమీ సేన్ తాజాగా హీరో జాన్ అబ్రహంపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అవుతున్నాయి. జాన్ అబ్రహంతో ఈమె గతంలో కలిసి నటించింది. ఇండస్ట్రీలో కొన్నాళ్లు బిజీగానే సినిమాలు చేసిన ఈమె ఈ మధ్య సినిమాలకు పూర్తిగా దూరంగా ఉంటూ దుబాయ్‌లో జీవితంను సాగిస్తోంది. దుబాయ్‌లో ఈమె ఒక రియల్ ఎస్టేట్ కంపెనీ ఏజెంట్‌గా జీవితాన్ని సాగిస్తున్నట్లు ఆమె సన్నిహితుల ద్వారా తెలుస్తోంది. ఇండస్ట్రీకి దూరంగా ఉన్నప్పటికీ అప్పుడప్పుడు ఇలా సినిమాలకు సంబంధించిన వ్యాఖ్యలు చేయడం, ఇంటర్వ్యూలు ఇస్తూ ఇండస్ట్రీ వారి గురించి మాట్లాడటం చేస్తూ ఉంటుంది. గతంలో బిగ్ బాస్ షో ఒక పనికిమాలిన షో అంటూ తీవ్రంగా విమర్శించింది. కేవలం పారితోషికం ఇస్తాను అంటే మాత్రమే ఆ షో కి వెళ్లాను, టాస్క్ లు చేస్తున్న సమయంలో నరకం కనిపించేదని రిమీ సేన్ చెప్పుకొచ్చింది. తాజాగా జాన్ అబ్రహం గురించి ఈమె మాట్లాడుతూ... జాన్ అబ్రహం ఎప్పుడూ తన లిమిట్స్‌లో సినిమాలను చేస్తూ ఉంటాడు. ఆయనకు నటన రాదు అనే విషయం ఆయనకు కూడా బాగా తెలుసు. అందుకే ఆయన ఎక్కువగా బాడీ చూపిస్తూ, కండలు చూపిస్తూ, ఫిజిక్ ను ఎక్స్‌పోజ్ చేసే వీలు ఉండే విధంగా యాక్షన్ సినిమాలను ఎంపిక చేసుకుంటూ ఉంటాడు. నటన రాకున్నా కేవలం యాక్షన్ సినిమాలు చేస్తూ కండలు చూపిస్తూ కెరీర్ ను నెట్టుకు వస్తున్నాడు. నటన రాదు కనుకే ఎప్పుడూ గంభీరంగా కనిపించే విధంగా ఉండాలని సీరియస్ కథలు ఎంపిక చేసుకుంటాడు. ఆయన కనీసం ఫేస్ ఎక్స్‌ప్రెషన్స్ కూడా ఇవ్వలేదని రిమీ సేన్ షాకింగ్ వ్యాఖ్యలు చేసింది. అతడి సినిమాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఆయన నటన ప్రతిభ ఏంటో అర్థం అవుతుంది అన్నట్లుగా రిమీ సేన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం బాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యాయి.





# పడక గదిలో వేరే అమ్మాయితో పలాశ్!

## అందుకే స్మృతి మంధానతో పెళ్లి రద్దు: విధాన మానే

### స్మృతి మంధాన పెళ్లి రద్దుపై సంచలన ఆరోపణలు

టీమిండియా మహిళా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్ పెళ్లి రద్దు కావడం వెనుక అత్యంత దిగ్భ్రాంతికరమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంపై స్మృతి బాల్య మిత్రుడు విధాన మానే చేసిన సంచలన ఆరోపణలు ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. నవంబర్ 23, 2025న మహారాష్ట్రలోని సాంగ్లీలో స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్‌ల వివాహం ఘనంగా జరగాల్సి ఉంది. కానీ పెళ్లి రోజే ముహూర్తం ఆగిపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అప్పట్లో స్మృతి తండ్రికి ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రిలో చేరడం వల్లే పెళ్లి వాయిదా పడిందని భావించారు. కానీ అసలు కారణం అది కాదని, పలాష్ ముచ్చల్ మోసం చేయడమేనని ఇప్పుడు తేలింది. స్మృతి మంధాన చిన్ననాటి స్నేహితుడు విధాన మానే ఓ ఇంటర్వ్యూలో పలాష్‌పై సంచలన ఆరోపణలు చేశారు. 'పెళ్లి వేడుకలు జరుగుతున్న సమయంలో పలాష్ మరో మహిళతో కలిసి పడకగదిలో రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయాడు. ఆ దృశ్యాన్ని చూసి మేమంతా షాక్ అయ్యాం. ఆ సమయంలో అక్కడ ఉన్న భారత మహిళా క్రికెటర్లు ఆగ్రహంతో పలాష్‌ను చితకబాదారు' అని విధాన మానే వెల్లడించారు. కేవలం స్మృతిని మోసం చేయడమే కాకుండా, పలాష్ తన దగ్గర నుంచి కూడా భారీగా డబ్బులు వసూలు చేశాడని విధాన మానే ఆరోపించారు. ఒక సినిమా నిర్మిస్తానని చెప్పి పలాష్ తన దగ్గర రూ. 40 లక్షలు తీసుకున్నాడని, కానీ ఇప్పటివరకు సినిమా తీయలేదని, డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. పెళ్లి రద్దు అయినప్పటి నుంచి పలాష్ తన ఫోన్ కాల్స్ ఎత్తడం లేదని, అతను ఓ పెద్ద మోసగాడని విధాన మానే మండిపడ్డారు. స్మృతి మంధాన కుటుంబం ఈ ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. పలాష్ పెళ్లి చేసుకుని సాంగ్లీలోనే స్థిరపడతాడని తాము ఆశించామని, కానీ అతని అసలు స్వరూపం బయటపడటంతో స్మృతి తండ్రి మనస్తాపానికి గురై అనారోగ్యం పాలయ్యారని సన్నిహితులు చెబుతున్నారు.

# దేవిషా వల్లే నేనిలా ఆడా: సూర్య



రాయ్‌పూర్ వేదికగా న్యూజిలాండ్ జట్టుతో జరిగిన రెండో టీ20లో 37 బంతుల్లోనే 82 పరుగులు చేసి భారత్‌కు అద్భుత విజయాన్ని అందించాడు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్. దాదాపు 468 రోజుల తర్వాత టీ20ల్లో అర్థ శతకం సాధించిన సూర్య కుమార్ యాదవ్.. తన ఫామ్‌పై వస్తున్న విమర్శలకు గట్టి సమాధానమిచ్చాడు. అయితే ఈ ఘనత సాధించిన తర్వాత సూర్య తన భార్య దేవిషా శెట్టి గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. బీసీసీఐ షేర్ చేసిన ఓ వీడియోలో సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. 'మనం ఇంటికి వెళ్ళినప్పుడు అక్కడ ఒక కోచ్ కూర్చుని ఉంటారు. ఆ కోచ్ మరెవరో కాదు.. మనం పెళ్లి చేసుకున్న వ్యక్తి (భార్య). నా ఆటను ఆమె చాలా దగ్గర నుండి గమనిస్తుంది. నా మనసులో ఏం నడుస్తుందో ఆమెకు బాగా తెలుసు' అని సూర్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.



# టీ20 వరల్డ్ కప్ నుంచి బంగ్లా ఔట్

## స్కాట్లాండ్ ఎంట్రీ: ఐసీసీ



టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభానికి ముందే అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) ఓ సంచలన నిర్ణయం తీసుకుంది.భారత్, శ్రీలంక వేదికలుగా ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్ 2026లో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. బంగ్లాదేశ్ జట్టును మెగా టోర్నీ నుంచి బహిష్కరించి ఆ స్థానాన్ని స్కాట్లాండ్ జట్టుకు కేటాయించింది. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్ జట్టు ఈ మెగా టోర్నీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఐసీసీ నిబంధనల విషయంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు, ఐసీసీకి మధ్య గత కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. ఐసీసీ విధానాలను పాటించాలని బంగ్లాదేశ్‌కు 24 గంటల గడువు ఇచ్చింది. అయినప్పటికీ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా ఈ కఠిన నిర్ణయాన్ని తీసుకున్నారు. బంగ్లాదేశ్ డిమాండ్లు ఐసీసీ పాలసీకి విరుద్ధంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత టీ20 ర్యాంకింగ్స్‌లో 14వ స్థానంలో ఉండటం, గత ప్రపంచకప్‌లలో స్కాట్లాండ్ చూపిన అత్యుత్తమ ప్రదర్శనల ఆధారంగా ఐసీసీ ఆ జట్టును ఎంపిక చేసింది. గ్రూప్ బీలో ఇంగ్లండ్‌తో సమానంగా పాయింట్లు సాధించినప్పటికీ, రన్ రేట్ తక్కువగా ఉండటంతో తృటిలో తదుపరి రౌండ్ అవకాశం కోల్పోయింది. 2022లో వెస్టిండీస్‌ను, 2021లో బంగ్లాదేశ్‌ను ఓడించి స్కాట్లాండ్ సంచలనం సృష్టించింది.

## పాక్ కొత్త డ్రామా స్టార్ట్

టీ20 ప్రపంచ కప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకోవడం, దాని స్థానంలో స్కాట్లాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఈ వివాదం సద్దుమణగక ముందే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కొత్త డ్రామాకు తెరలేపింది. భారత్ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో తమ భాగస్వామ్యంపై పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ మాట్లాడుతూ.. పాకిస్థాన్ జట్టు ప్రపంచకప్‌లో పాల్గొనాలా వద్దా అనేది పూర్తిగా తమ ప్రభుత్వంపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. 'ఒకవేళ పాకిస్థాన్ ప్రభుత్వం ప్రపంచకప్ ఆడొద్దని చెబితే, ఐసీసీ మా స్థానంలో 22వ జట్టును వెతుక్కోవచ్చు. మా ప్రధాన మంత్రి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాతే దీనిపై స్పష్టత వస్తుంది' అని పేర్కొన్నారు. వాస్తవానికి భద్రతా కారణాల రీత్యా భారత్‌కు రావడానికి పాకిస్థాన్ మొదటి నుంచీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. బంగ్లాదేశ్ తన మ్యాచ్‌లను హైబ్రిడ్ మోడల్‌లో (మరో దేశంలో) నిర్వహించాలని కోరి విఫలమవ్వడం, ఇప్పుడు ఏకంగా టోర్నీ నుంచే తప్పుకోవడంతో పాకిస్థాన్ కూడా అదే వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఒకవేళ పాకిస్థాన్ కూడా తప్పుకుంటే, ఐసీసీ ఆ స్థానంలో జింబాబ్వే లేదా మరో అసోసియేట్ దేశాన్ని ఆహ్వానించే అవకాశం ఉంది.



# భారత్ హ్యాట్రిక్ విజయం

## అండర్-19 వరల్డ్ కప్‌లో కుర్రాళ్ల దూకుడు

బులవాయో: అండర్-19 ప్రపంచ కప్‌లో భారత్‌కు విజయం సాధించింది. గ్రూప్ బిలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో(డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి) టీమ్‌ఇండియా గెలిచింది. యువ భారత్‌కు ఇది హ్యాట్రిక్ విజయం. వర్షం కారణంగా మ్యాచ్‌ను 37 ఓవర్లకు కుదించారు. కివీస్ 36.2 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌటైంది. ఋూా ప్రకారం భారత్ లక్ష్యం 130పరుగులుగా నిర్దేశించారు. టార్గెట్‌ని ఇండియా 13.3 ఓవర్లలోనే ఛేదించింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53; 27 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో మెరవగా.. వైభవ్ సూర్యవంశీ (40; 23 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అదరగొట్టాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. మన బౌలర్ల ధాటికి కివీస్ ఒక దశలో 22 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. జాకబ్ కాటర్ (23), జస్కరన్ సంధు (18) నిలవడంతో ఆ జట్టు కాస్త కోలుకుంది. వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటవడంతో కివీస్ 69/7తో మళ్లీ కష్టాల్లో పడింది. ఈ దశలో కల్లమ్ శాంసన్ (37ి), సెల్విన్ సంజయ్ (28) కివీస్‌ను ఆదుకున్నారు. భారత బౌలర్లలో ఆర్ఎస్ అంబరీష్ (4/29), హెనిల్ పటేల్ (3/23) అదరగొట్టగా.. ఖిలాన్ పటేల్, మహ్మద్ ఎనాన్, కనిష్క్ చౌహాన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# ఆర్సీబీ తొలి ఓటమి

## షాకిచ్చిన ఢిల్లీ.. ప్లే ఆఫ్స్ ఆశలు సజీవం



మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో ఓటమన్నదే ఎరుగని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఢిల్లీ క్యాపిటల్స్ చెక్ పెట్టింది. గత మ్యాచ్‌లో ఘోర పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంటూ భారీ విక్టరీ కొట్టింది. ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో ఢిల్లీ బౌలర్లు చిన్నెలె హెన్రీ(2-22), మరినే కాప్(2-17)లు పంజా విసిరారు. 110 పరుగుల స్వల్ప ఛేదనలో లారా వొల్వార్ట్(42 నాటౌట్), జెమీమా రోడ్రిగ్స్(24) కూల్‌గా ఆడి ఢిల్లీని విజయతీరాలకు చేర్చారు. మరినే కాప్(19 నాటౌట్) బౌండరీతో మ్యాచ్‌ను ముగించగా.. ఆరు పాయింట్లతో ఢిల్లీ రెండో స్థానానికి ఎగబాకింది. ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే గెలవకతప్పని మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ గర్జించింది. అజేయంగా ప్లే ఆఫ్స్ చేరిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు షాకిస్తూ ఏడు వికెట్లతో జయభేరి మోగించింది. బిగ్ హిట్టర్లతో నిండిన ఆర్సీబీని 109కే కట్టడి చేసి బౌలర్లు సగం విజయాన్ని కట్టబెట్టగా.. బ్యాటింగ్ యూనిట్ సమిష్టిగా రాణించడంతో ఢిల్లీ ప్లే ఆఫ్స్ బరిలో నిలిచింది. స్వల్ప ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్ షఫాలీ వర్మ(16) శుభారంభమిచ్చింది. సయాలీ శర్మ ఓవర్లో ఫ్రంట్‌ఫుట్ వచ్చి.. రీచా ఘోష్ రెప్పపాటులో స్టంపౌట్ చేసింది. ఆ కాసేపటికే లిజెల్లీ లీ(6) సైతం ఆమె ఓవర్లోనే వోల్ చేతుల్లోకి బంతిని పంపి వెనుదిరిగింది. ఓపెనర్లు వెనుదిరిగాక జట్టును గెలిపించే బాధ్యత తీసుకుంది కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్(24) అయితే.. లారె 4 పరుగులు వద్ద జెమీమా ఇచ్చిన క్యాచ్‌ను షార్ట్ థర్డ్‌లో సయాలీ సత్ఘరే జారవిడిచింది. ఆ లైఫ్‌ను సద్వినియోగం చేసుకో.. లారా వొల్వార్ట్(42 నాటౌట్)తో కలిసి .. 19 పరుగుల వద్ద గౌతమి క్యాచ్ వదిలేయగా.. జెమీమా బతికిపోయింది. కానీ, ఎట్టకేలకు రాధా యాదవ్ ఓవర్లో ఆమె కవర్స్‌లో మంధానకు దొరికింది. దాంతో, మూడో వికెట్ 52 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం మరికే కాప్(19 నాటౌట్), వొల్వార్ట్ ఆడుతూపాడుతూ లాంఛనం పూర్తి చేశారు. శ్రేయాంక పాటిల్ వేసిన 16వ ఓవర్ నాలుగో బంతికి మరినే కాప్ బౌండరీ బాదడంతో 7 వికెట్ల తేడాతో ఢిల్లీ గెలుపొందింది. వరుసగా ఐదు విజయాలతో ప్లే ఆఫ్స్ చేరిన ఆర్సీబీని భారీ స్కోర్ చేయకుండా ఢిల్లీ క్యాపిటల్స్‌ను గొప్పగా అడ్డుకుంది. బౌలింగ్, ఫీల్డింగ్‌లో అదుర్స్ అనిపిస్తూ బెంగళూరు బిగ్ హిట్టర్లకు ముకుతాడు వేశారు ఢిల్లీ ప్లేయర్లు. చిన్నెలె హెన్రీ(2-22), మరినే కాప్(2-17) విజృంభణతో మిడిలార్డర్ కుప్పకూలగా కెప్టెన్ స్మృతి మంధాన(38) రాణించింది. డెత్ ఓవర్లలో నందిని శర్మ(3-26) తన పేస్ పవర్‌తో టెయిలెండర్లను డగౌట్ చేర్చింది. ఆఖరి ఓవర్లో శ్రేయాంక పాటిల్(7), సయాలీ సత్ఘరే(3) ఔట్ కావడంతో ఆర్సీబీ109 పరుగులకే పరిమితమైంది. డబ్ల్యూపీఎల్ చరిత్రలో ఇదే నాలుగో అత్యల్ప స్కోర్ కావడం గమనార్హం.

ఈవార్తలు **ప్రజావాణి**

సంపాదకీయం

www.evarthalu.com

నేటి ఈవార్తలు

ఆదివారం 25-1-2026

# ఫోన్ ట్యాపింగ్.. రాజకీయ అస్త్రం



**ఒకప్పుడు** ఫోన్ ట్యాపింగ్ అనేది కేవలం గూఢచారి సినిమాల్లోనో లేదా దేశ భద్రతకు ముప్పు వాటిల్లినప్పుడో వినిపించే మాట. కానీ, నేడు రాజకీయాల్లో, నేర పరిశోధనలో, చివరికి కార్పొరేట్ యుద్ధాల్లో కూడా 'ఫోన్ ట్యాపింగ్' అనేది ఒక అత్యంత సాధారణమైన అంశంగా మారిపోయింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తిగత స్వేచ్ఛకు ఇది గొడ్డలిపెట్టు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వాలు వ్యవస్థలు దీనిని ఒక అవసరంగా భావించడం గమనార్హం. సాంకేతికత పెరిగిన కొద్దీ సంభాషణలు సులభమయ్యాయి, అదే స్థాయిలో వాటిని దొంగచాటుగా వినడం కూడా సులభమైంది. ఒకప్పుడు కేవలం టెలికాం ఎక్స్ఛేంజీల ద్వారా మాత్రమే సాధ్యమయ్యే ట్యాపింగ్, నేడు అధునాతన సాఫ్ట్‌వేర్‌లు (ఉదాహరణకు పెగాసస్ వంటివి) స్పైవేర్‌ల ద్వారా స్మార్ట్‌ఫోన్ మైక్రోఫోన్‌ను, కెమెరాను కూడా నియంత్రించే స్థాయికి చేరింది. మనం జేబులో పెట్టుకున్న ఫోనే మనపై నిఘా ఉంచే వేగులా మారిపోవడం నేటి చేదు నిజం. ప్రతిపక్షాల వ్యూహాలను తెలుసుకోవడానికి, అసమ్మతి గళాలను అణచివేయడానికి లేదా సొంత పార్టీ నేతల కదలికలపై నిఘా ఉంచడానికి ఫోన్ ట్యాపింగ్‌ను ఒక ఆయుధంగా వాడుకోవడం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ధోరణి. అధికారంలో ఉన్నప్పుడు ఇది శాంతి భద్రతల పరిరక్షణ అనిపించుకుంటుంది, కానీ అధికారం కోల్పోయాక ఇదే వ్యక్తిగత స్వేచ్ఛా హరణంగా మారుతుంది. ఈ వైరుధ్యమే ట్యాపింగ్‌ను రాజకీయాల్లో ఒక కామన్ అంశంగా మార్చేసింది. భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో గోప్యత కూడా అంతర్భాగమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, టెలిగ్రాఫ్ చట్టం వంటివి దేశ భద్రత, సార్వభౌమత్వం దృష్ట్యా నిఘా పెట్టే అధికారాన్ని ప్రభుత్వాలకు కల్పిస్తున్నాయి. కానీ, ఈ 'దేశ భద్రత' అనే పదాన్ని సాకుగా చూపి వ్యక్తిగత సంభాషణల్లోకి చొరబడటం ఒక నిత్యకృత్యంగా మారిపోయింది. దర్యాప్తు సంస్థలకు ఇది నేరస్తులను పట్టుకునే సులభమైన మార్గం కావచ్చు, కానీ సామాన్యుడిలో మాత్రం తమ సంభాషణలు ఎక్కడ రికార్డ్ అవుతున్నాయో అన్న ఆందోళన నెలకొంది. ఫోన్ ట్యాపింగ్ అనేది ఒక సాధారణ విషయంగా మారిపోవడం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సంకేతం కాదు. టెక్నాలజీ ప్రపంచంలో ఏదీ వంద శాతం రహస్యం కాదని సరిపెట్టుకోవాలా లేక చట్టాల ద్వారా దీనికి అడ్డుకట్ట వేయాలా అన్నది చర్చించాల్సిన అంశం. నిఘా అనేది కేవలం నేర నియంత్రణకు మాత్రమే పరిమితం కావాలి తప్ప, అది ఒక వ్యక్తి స్వేచ్ఛను హరించే సాధనం కాకూడదు. వ్యవస్థలు పారదర్శకంగా ఉన్నప్పుడే పౌరుల వ్యక్తిగత గోప్యతకు భద్రత లభిస్తుంది. లేదంటే, గోడలకు చెవులు ఉండటం పాత మాట.. ప్రతి జేబులోని ఫోన్ ఒక చెవిగా మారడం కొత్త నిజం.

– ఈవార్తలు సంపాదకీయ విభాగం




# ఓటు.. నీ భవితకు రూటు

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం.. భారత్. ఈ ప్రజాస్వామ్య భవనానికి పునాది ఓటు. ప్రతి ఏటా జనవరి 25న మనం జాతీయ ఓటరు దినోత్సవం జరుపుకుంటున్నాం. 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం ఏర్పడిన సందర్భాన్ని పురస్కరించుకుని, ఓటర్లలో చైతన్యం నింపడానికి 2011 నుంచి ఈ వేడుకను నిర్వహిస్తున్నాం. ఓటు అనేది కేవలం ఒక గుర్తు కాదు, అది పౌరుడి చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన అక్షరాయుధం. ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల కోసం నడిచే ప్రభుత్వం. ఇక్కడ పాలకులను ఎంచుకునే సర్వాధికారం సామాన్యుడికి ఉంటుంది. కోటీశ్వరుడి ఓటుకైనా, పేదవాడి ఓటుకైనా రాజ్యాంగం సమాన విలువను ఇచ్చింది. ఒక్క ఓటుతో ఏమవుతుంది? అనుకోవడం అజ్ఞానం. చరిత్రలో ఒక్క ఓటుతో ప్రభుత్వాలు పడిపోయిన సందర్భాలు, గెలుపోటములు తలకిందులైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. చాలామంది ఓటింగ్ రోజును కేవలం ఒక సెలవు దినంగా భావిస్తారు. కానీ, ఓటు వేయకపోవడం అంటే మన భవిష్యత్తును నిర్ణయించే అధికారాన్ని ఎవరో ఒకరికి అప్పగించడమే. సరైన నాయకుడిని ఎన్నుకోనప్పుడు, వ్యవస్థలో లోపాలను ప్రశ్నించే నైతిక హక్కును మనం కోల్పోతాం. అవినీతి రహిత పాలన, మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య, వైద్యం కావాలని కోరుకునే ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు వేయాలి. భారతదేశం యువ దేశం. దేశ జనాభాలో సగానికి పైగా యువత ఉన్నారు. నవ భారత నిర్మాణంలో యువ ఓటర్ల పాత్ర అత్యంత కీలకం. సోషల్ మీడియాలో విమర్శలు చేయడం కంటే, పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయడం ద్వారా వ్యవస్థలో మార్పు తీసుకురావచ్చు. కొత్తగా 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడు వోటర్స్ సర్వీస్ పోర్టల్ ద్వారా తమ పేరును నమోదు చేసుకోవాలి. నేటి రాజకీయాల్లో డబ్బు, మద్యం, కులం, మతం ఓటరును ప్రలోభపెడుతున్నాయి. ఐదు వందలకో, వెయ్యి రూపాయలకో మన ఓటును అమ్ముకోవడం అంటే మన ఐదేళ్ల భవిష్యత్తును, ఆత్మగౌరవాన్ని అమ్ముకోవడమే. ఓటును అమ్ముకునే ఓటరుకు పాలకుడిని ప్రశ్నించే ధైర్యం ఉండదు. కాబట్టి, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, అభ్యర్థి గుణగణాలను, గత చరిత్రను పరిశీలించి ఓటు వేయాలి. ఓటు వేయడం మన హక్కు మాత్రమే కాదు.. బాధ్యత కూడా. రేపటి తరం బాగుండాలన్నా, దేశం ప్రగతి పథంలో నడవాలన్నా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

## ఎన్నికల సంఘం సంస్కరణలు ఇలా..

- ఈవీఎంలు, వీవీప్యాట్: ఓటు ఎవరికి పడిందో చూసుకునే సౌకర్యం.
- నోటా: ఏ అభ్యర్థి నచ్చకపోతే తిరస్కరించే హక్కు.
- సాక్షం యాప్: దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు.
- సీ-విజిల్: ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేసే అవకాశం.
- ఈసీ వెబ్‌సైట్: ఓటరు జాబితాలో మీ పేరును చూసుకొనేందుకు, కొత్త దరఖాస్తు, తప్పుల సవరణ.


- రణధీర్ గుండు

# తెలంగాణం.. పర్యాటక మాగాణం

తెలంగాణ, దక్కన్ పీఠభూమి నడిబొడ్డున కొలువైన భూమి. నూతన రాష్ట్రంగా ఆవిర్భవించిన నాటి నుండి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణ, పర్యాటక రంగంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. ఇక్కడి పర్యాటక అనుభవం కేవలం కంటికి ఇంపుగా ఉండే ప్రదేశాలను చూడటం మాత్రమే కాదు; అది చరిత్రలో ఒక ప్రయాణం, సంస్కృతిలో ఒక లీనం, ప్రకృతితో ఒక మమేకం. తెలంగాణ చరిత్ర, శతాబ్దాల రాజుల పాలనలో, రాజవంశాల ఆవిర్భావంలో, పతనాలలో రూపుదిద్దుకుంది. కాకతీయుల శిల్పకళా వైభవం, కుతుబ్ షాహీల గోల్కొండ కోట బలం, నిజాంల అపురూప వారసత్వం – ఇవన్నీ తెలంగాణ పర్యాటకానికి పునాదులు.







కాకతీయుల రాజధాని వరంగల్, ఒకప్పుడు ఓరుగల్లు అని పిలువబడేది, శిల్పకళకు పరాకాష్ట. ఇక్కడి వేయి స్తంభాల గుడిలోని ప్రతి అంగుళం అద్భుతమైన నైపుణ్యానికి నిదర్శనం. రామప్ప దేవాలయం (ప్రస్తుతం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం), తేలియాడే ఇటుకలతో నిర్మించిన నిర్మాణం, నాటి ఇంజనీరింగ్ అద్భుతాలకు ప్రతీక. ఈ చారిత్రక కట్టడాలు పర్యాటకులను ఆశ్చర్యచకితులను చేస్తాయి. హైదరాబాద్‌కు ఆభరణాలుగా నిలిచే గోల్కొండ కోట, దాని ఫతే దర్వాజా వద్ద చప్పట్లు కొడితే కిలోమీటరు దూరంలోని బాలా హిస్సార్ వద్ద వినపడే ధ్వని వ్యవస్థ నాటి నిర్మాణ కౌశలానికి సాక్ష్యం. చార్మినార్, భాగ్యలక్ష్మి ఆలయం, మక్కా మసీదు వంటివి నవాబుల కాలం నాటి ఘన వారసత్వాన్ని కళ్ళముందు ఉంచుతాయి. తెలంగాణ అంటే కేవలం చరిత్ర మాత్రమే కాదు, ప్రకృతి సౌందర్యం కూడా ఇక్కడ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంది. ఆదిలాబాద్, కొమరం భీం జిల్లాల్లో విస్తరించిన దట్టమైన అడవులు, ప్రాణహిత, కవ్వాల్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామం. ఇక్కడి పులులు, చిరుతలు, అరుదైన పక్షి జాతులు పర్యాటకులను ఆకర్షిస్తాయి. బోగత జలపాతం, కుంటాల జలపాతం వంటివి తెలంగాణలోని సహజసిద్ధమైన అందాలకు నిదర్శనం. వర్షాకాలంలో ఈ జలపాతాల సందడి పర్యాటకులకు మరపురాని అనుభూతినిస్తుంది. గోదావరి, కృష్ణా నదులు తెలంగాణ భూమిని సస్యశ్యామలం చేస్తాయి. నాగార్జున సాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టులు కేవలం సాగునీటి వనరులు మాత్రమే కాకుండా, అద్భుతమైన పర్యాటక ప్రదేశాలుగా విరాజిల్లుతున్నాయి. బుద్ధుడి చరిత్రకు ప్రతీకగా నిలిచే నాగార్జునకొండ పర్యాటకానికి కొత్త కోణాన్ని అందిస్తుంది. తెలంగాణ ప్రజల ఆతిథ్యం, ఇక్కడి సంస్కృతిలో అంతర్లీనంగా ఉంటుంది. బోనాలు, సమ్మక్క సారలమ్మ జాతర, బతుకమ్మ వంటి పండుగలు తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలు. ఈ పండుగల సమయంలో తెలంగాణ కొత్త శోభను సంతరించుకుంటుంది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, బోనాల ఊరేగింపులు పర్యాటకులకు స్థానిక సంస్కృతిని దగ్గరగా పరిచయం చేస్తాయి. సమ్మక్క సారలమ్మ జాతర, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందింది, లక్షలాది మంది భక్తులను, పర్యాటకులను ఆకర్షిస్తుంది. పోచంపల్లి పట్టు చీరలు, బిద్రీ కళతో చేసిన వస్తువులు తెలంగాణ హస్తకళా నైపుణ్యానికి నిదర్శనాలు. ఈ కళాఖండాలు పర్యాటకులకు మంచి జ్ఞాపకాలుగా మిగులుతాయి. తెలంగాణ పర్యాటక రంగం ఒక వజ్రం లాంటిది, ఇంకా పూర్తిగా సానబట్టబడలేదు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, హోటళ్ల నిర్మాణం, పర్యాటక ప్రదేశాల అభివృద్ధి వంటి చర్యలు ఈ రంగానికి కొత్త ఊపిరి పోస్తున్నాయి. తెలంగాణ కేవలం ఒక రాష్ట్రం కాదు, అది అనుభూతుల కలగలుపు. చరిత్రను ప్రేమించేవారికి, ప్రకృతిని ఆరాధించేవారికి, సంస్కృతిని తెలుసుకోవాలనుకునేవారికి.. తెలంగాణ ఒక సంపూర్ణమైన ప్యాకేజీ. ఇక్కడి ప్రతి పర్యటన ఒక కొత్త అధ్యాయాన్ని పరిచయం చేస్తుంది.

**- అనుమల్ల అనంతయ్య, కరీంనగర్**

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.